ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

సోమవారం 6 అక్టోబరు 2025 | 3



తగ్గినా..ఇంతేనా!



పుష్కరఘాట్ వద్ద తగ్గిన గోదావరి.. ఇంకనూ గేటు వద్ద సెక్యూరిటీ

గోదావరి తగ్గుముఖం పట్టింది.. సాధారణ స్థాయికి చేరింది.. అయినా ఆంక్షలు మాత్రం తొలగలేదు.. నేటికీ రేవుల వద్దకు ఎవరినీ వెళ్లనీయడంలేదు..దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.. ఇటీవల గోదావరికి వరద పోటెత్తడం.. ఇద్దరు భవానీల మృతితో ఆంక్షలు విధించారు. గోదావరి తగ్గినా ఇంకా ఆంక్షలు మాత్రం కొనసాగుతున్నాయి. ఆంక్షలు సడలించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం



రాజమహేంద్రవరంలో జరిగిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల సమావేశానికి హాజరైన సచివాలయ ఉద్యోగులు.. మాట్లాడుతున్న సంఘ నాయకులు



116 ఎకరాలు కేటాయించిన రాజమహేంద్రవరంలోని బ్రిడ్జిలంక

భూ..లోకం!

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులకు 205 ఎకరాలు

పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే అడిగింది ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 205 ఎకరాలు భూములు సిద్ధం చేసింది.. ఇందులో రాజమహేంద్రవరానికి చేరువగా బ్రిడ్జిలంక వద్ద 116 ఎకరాలు సేకరించారు.. కడియం, సీతానగరం , కాకినాడ తదితర ప్రాంతాల్లోనూ భూములు ఉండడం గమనార్హం. ఆసక్తి ఉండి ముందుకొస్తే చాలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందాలకు నెలవైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటక రంగాన్ని పరుగులు తీయించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గోదావరి అందాలు,సముద్ర తీరం వెంబడి అనేక సాహస జలక్రీడల నిర్వహణకు సన్నాహాలు చేస్తోన్న ప్రభుత్వం తాజాగా పర్యాటక పెట్టుబడులను భారీగా ఆహ్వానించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్యతరహా, భారీ పర్యాటక పెట్టుబడులతో ముందుకొచ్చే కంపెనీలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా తక్షణమే భూములు కేటాయించేలా భూ బ్యాంకు సిద్ధం చేసింది.తక్కువ ధరకే భూములు దీర్ఘకాలిక లీజులపై కేటాయించాలని నిర్ణయించింది.ఈ మేరకు ప్రభుత్వమే ఉమ్మడి జిల్లాలో 205 ఎకరాల భూములు సిద్ధం చేసింది.కాకినాడ, ఏలేశ్వరం, గోగుల్లంక, పిచ్చుకలంక,సీతానగరం, కడియపులంక తదితర అద్భుత పర్యాటక అందాలు ఉన్న ప్రాంతాల్లో భూములు కేటాయించేందుకు ఏర్పాట్లు చేసింది.రాజమండ్రిలోని బ్రిడ్జిలంక వద్ద 116 ఎకరాలు సిద్ధం చేసింది.

కూటమి ప్రత్యేక దృష్టి

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం పూర్తిగా పడకేసింది. గోదావరిలో బోటు షికారు, కాకినాడ హోప్ఐలాండ్ షికారు, దిండి రిసార్ట్స్ వద్ద బోటింగ్ ఇలా దేనికీ వసతులు కల్పించక బోట్లు కేటాయించక పర్యాటక రంగం ఈసురోమంది. కాకినాడ సాగర తీరంలో యుద్ధవిమాన మ్యూజియానికి సైతం నిధులివ్వకుండా ఖాళీగా వదిలేసింది. ప్రభుత్వం మారిన తర్వాత గడచిన ఏడాదిగా ఉమ్మడి జిల్లాలో పర్యాటక సదుపాయాలకు సర్కారు పెద్దపీట వేస్తోంది.నిధులు కేటాయిస్తోంది. గత ప్రభుత్వంలో ఏ మాత్రం పట్టించుకోని గోదావరి హేవలాక్ వంతెనతో పాటు చుట్టుపక్కల అనేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి రూ.94.44 కోట్ల నిధులు రాబట్టి అఖండ గోదావరి ప్రాజెక్టుకు జూన్‌లో శంకుస్థాపన చేసింది. గోదావరి ఇసుక తిన్నెల్లో 120 ఎకరాల్లో టెంట్‌సిటీ నిర్మాణానికి అడుగులు వేస్తోంది.ఐదేళ్లుగా నిలిచిన కాకినాడ హోప్ ఐలాండ్ పర్యాటకాన్ని ఇటీవల

- పర్యాటకానికి పెద్దపీట
- భూమిని సిద్ధం చేసిన ప్రభుత్వం
- దీర్ఘకాలిక లీజుపై ఇచ్చే యోచన
- పెట్టుబడుదారులకు ఆహ్వానం
- ముందుకొస్తే భూకేటాయింపు
- ఉమ్మడి జిల్లాలో అమలు
- నాడు ఏమీ పట్టని వైసీపీ
- నేడు పట్టు వదలని కూటమి

పునరుద్ధరించింది.కాకినాడ, రాజమహేంద్రవరం,కోనసీమ జిల్లాల్లో 18 చోట్ల అడ్వంచర్ టూరిజం ప్రోత్సహించడానికి ఆదేశాలిచ్చింది.కాలువలు, సముద్రతీరం వెంబడి సాహస జలక్రీడలు అందుబాటు లోకి తెచ్చేలా టెండర్లు పిలిచింది.ఉమ్మడి జిల్లాలో పర్యాటక పెట్టుబడులు కోట్లలో రాబట్టేందుకు వీలుగా భూబ్యాంకు సిద్ధం చేసింది.



అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా కడియం వద్ద ఇలా.

భూములున్నదిక్కడే..

పర్యాటక ప్రాజెక్టులకు భూములు తక్షణం కేటాయించేందుకు వీలుగా కాకినాడ నగరానికి సమీపంలోని తమ్మవరంలో 12.66 ఎకరాలు భూ బ్యాంకు తయారు చేసింది. సర్వేనెంబరు 292 నుంచి 299 వరకు సముద్రానికి దగ్గర ఉన్న భూములు రకరకాల పర్యాటక ప్రాజెక్టులు ఇచ్చేందుకు సిద్ధం చేసింది. వీటిలో హోటళ్లు, రిసార్టులు, బైక్, కారు రేసింగ్‌లు, సాహస క్రీడల ప్రాజెక్టులకు కేటాయించనుంది.ఏలేశ్వరం వద్ద సర్వే నెంబరు 83/2లో 15 ఎకరాలు సిద్ధం చేసింది. ఇక్కడ రిసార్టులు,నేచర్ టూరిజం ప్రోత్సాహానికి కేటాయింపులు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో సర్వే నెం బరు 799లో 9.9 ఎకరాల భూబ్యాంకు సిద్ధమైంది. ఇక్కడా గోదావరి అందాలు వీక్షించేలా బోటింగ్ రెస్టారెంట్,అడ్వంచర్ గేమ్స్ ఏర్పాటుకు భూ కేటాయింపులు జరపనున్నారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం గోదావరి అందా లకు పెట్టింది పేరు. ఇక్కడ ఎన్నో సినిమాలు చిత్రీకరణ జరిగాయి. అద్భుతమైన లొకేషన్లు ఉన్న ఈ ప్రాంతంలో సర్వేనెంబరు 327/1లో 7.5 ఎకరాల భూ బ్యాంకును అందుబాటులోకి తెచ్చారు. రిసార్టులు, హోటళ్లు, బోటింగ్,హ ట్‌లు, వాటర్ స్పోర్ట్స్ ఇలా ఏతరహా పర్యాటక పెట్టుబడులు పెట్టాలన్నా వీటిని కేటాయించనున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని బ్రిడ్జిలంక వద్ద ఏకంగా 116 ఎకరాల అన్ సర్వేయడ్ భూమిని సిద్ధం చేశారు. టెంట్ హౌస్‌లు, బోటింగ్, రిసార్టుల నిర్మాణానికి వీటిని కేటాయించాలని నిర్ణయించారు. కడియపులంకలో సర్వే నెంబరు 402/1లో 2.60 ఎకరాలు, కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక దీవిలో సర్వే నెంబరు 155/1లో 26 ఎక రాల భూ బ్యాంకు సిద్ధమైంది. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గోగుల్లంక వద్ద సర్వే నెంబరు 759లో 13.62 ఎకరాలు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ గోదావరి అందాల వీక్షణ,కేరళ తరహాలో కొబ్బరి చెట్ల అందాలు, మండువాలోగిళ్లు పర్యాటకులను అలరించనున్నాయి. ఇక్కడ రిసార్టులు, హోటళ్ల నిర్మాణానికి భూములు కేటాయించనున్నారు.పట్టిసీమలో 168 ఎకరాలు పర్యాటక సం స్థలు,వ్యక్తులకు కేటాయించనున్నారు.వీటిని తక్కువ ధరకు దీర్ఘకాలిక లీజుపై కేటాయించనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

వలంటీర్ల విధులు చేయలేం

రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక చైర్మన్ జానీ పాషా

రాజమహేంద్రవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్ల విధుల నుంచి సచివాలయ ఉద్యోగులకు విముక్తి కలిగించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ ఎండీ జానీ పాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్ కృష్ణకన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ హెచ్చరించారు.రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఐక్యవేదిక ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రాంతీయ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, వలంటీర్ విధుల నుంచి విముక్తి కల్పించాలని, ఆరేళ్లగా ఒకే క్యాడర్‌లో పనిచేస్తున్నందున ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ ద్వారా స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, రికార్డు అసిస్టెంట్ పేస్కేల్‌తో క్యాడర్ అప్ గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బత్తుల అంకమ్మరావు, యువ షణ్ముఖ, కేవీ.రాజేష్‌బాబు, వి.భార్గవ్ సుతేజ్, ఎస్‌కె.మహమూబ్,జీవీఎస్ శ్రీనివాస్, కె.షాలెం, కృష్ణ వెస్లీ, ఆళ్ల శ్రీధర్‌రెడ్డి, బి.రోజా ప్రకాష్, ఎస్.నాగేశ్వరరావు, ఎస్‌కె మహబూబా సుభానీ, దడాల జగ్గారావు, నవకోటి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జీఎస్ఎల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కుటుంబరావు, చిత్రంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, జీఎస్ఎల్ చైర్మన్ గన్ని భాస్కరరావు తదితరులు

పేదరిక నిర్మూలనకే పీ4

స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు

రాజానగరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థలు, పెద్దలు పీ4 కార్యక్రమంలో పాల్గొని పేదరిక నిర్మూలనలో భాగస్వాములై ప్రభుత్వానికి అండగా నిలవాలని స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ చెరుకూరి కుటుంబరావు పేర్కొన్నారు. రాజానగరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో జీఎస్ఎల్ హెల్త్‌కేర్ అండ్ హెల్త్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పీ4 అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి4)కార్యక్రమాలు చేపట్టేవారికి ఎలాంటి జాప్యం లేకుండా సింగిల్ విండో విధానం తీసుకొచ్చే యోచన చేస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ సీఈవో సీహెచ్.నరేష్ కుమార్ మాట్లాడుతూ పీ4లో భాగంగా చేపట్టిన సర్వేలో 20 లక్షల మంది బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పీ4లో చోటు దక్కలేదని, తిరిగి పీ4 సర్వే మరోసారి నిర్వహించాలని కోరారు. జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ పీ4 కార్యక్రమ నిర్వహణకు సాయం అందజేస్తున్నామన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రోటరీ ప్రెసిడెంట్ తీగల రాజా, తిరుమల చైర్మన్ నున్న తిరుమలరావు, జాస్తి మూర్తి, డాక్టర్ దివ్య, వి.రామనాథ్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరాజు, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణబ్రహ్మజీ, వీరన్న చౌదరి పాల్గొన్నారు.



కోటసత్తెమ్మకు పూజలు

నిడదవోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం,సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహా నివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారికి రూ.1,84,316 ఆదాయం లభించినట్టు దేవ స్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్, చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.



దసరా ఉత్సవాలు ముగిశాయి.. అమ్మవార్లకు 9 రోజుల పాటు పూజలు చేశారు..ఆదివారం అమ్మవార్లను నిమజ్జనానికి తరలించారు. తాడిపర్రులో హంసవాహనంపై అమ్మవారిని ఊరేగించారు. - ఉండ్రాజవరం

స్వచ్ఛం..సత్యం!

ఇటీవల ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి, 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయి. ఈ అవార్డులను సోమ వారం అందజేయనున్నారు.రాష్ట్ర స్థాయి అవార్డులు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ అడిష నల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, కొవ్వూరు ఆర్టీసీ డీఎం వైవీవీఎస్.కుమార్ అందుకోనున్నా రు.జిల్లా స్థాయి అవార్డులను ఆనం కళాకేంద్రం లో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా ఆయా అవార్డు గ్రహీ తలు అందుకోనున్నారు. జిల్లాలోని ప్రజాప్రతి నిధులకు, అవార్డు గ్రహీతలకు జిల్లాస్థాయి అధికారులకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి.

- జిల్లాకు 54 స్వచ్ఛాంధ్ర అవార్డులు
- 3 రాష్ట్రస్థాయి..51 జిల్లాకు ఎంపిక
- కష్టపడ్డారు..ఫలితం సాధించారు
- నేడు అవార్డులు అందజేత
- ఇప్పటికే ఆహ్వానాలు చేరిక



కొవ్వూరు బస్టాండ్

కొవ్వూరు బస్టాండ్..అద్వితీయం!

కొవ్వూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్ స్వచ్ఛత అవార్డుల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానానికి ఎంపికైంది. గతంలో కొవ్వూరుకు డిపో మేనేజర్‌గా పనిచేసిన వై.వి.వి.ఎన్.కుమార్ ఆధ్వర్యంలో డిపో, బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం, పరిసరాలలో మొక్కలు నాటి సంరక్షించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని స్వచ్ఛత అవార్డుకు ఎంపిక చేశారు. దీనిపై ప్రస్తుత రావులపాలెం డిపో మేనేజర్ వై.వి.వి.ఎన్.కుమార్ మాట్లాడుతూ డిపోలోని అందరి ఉద్యోగులు, కార్మికుల సహకారంతో అవార్డును సాధించామని, అవార్డుకు ఎంపికవడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

ఆర్‌డీవో ఆఫీస్..సూపర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశుభ్రమైన కార్యాలయంగా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం అవార్డు సాధించింది. ఆర్‌డీవోగా ఆర్.కృష్ణనాయక్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దారు. కార్యాలయ సిబ్బంది తాగునీటికి ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను వినియోగించవద్దని సూచించి స్వయంగా స్టీల్ వాటర్ బాటిళ్లు,జ్యూట్ బ్యాగ్‌లు అందజేశారు.డస్ట్ బిన్నులను ఏర్పాటు చేయించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్నారు.సబ్‌కలెక్టర్ కార్యాలయానికి అవార్డు రావడం పట్ల ఆర్‌డీవో కృష్ణనాయక్ ఆనందం వ్యక్తం చేశారు.



పంగిడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

చెత్తను అమ్మేస్తున్నారు..



అనపర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలం కుతుకులూరు ఉత్తమ స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది చూపిస్తున్న అంకిత భావం అవార్డు సాధనకు దోహదపడింది. అంచెలంచెలుగా పంచాయతీలో తడి చెత్త పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుం డా ఇలా విడదీసిన చెత్త ద్వారా ఎరువును త యారు చేసి విక్రయిస్తూ ఆదాయం చేకూరుస్తు న్నారు. కార్యదర్శి ఫణికుమార్ మాట్లాడు తూ అవార్డు సాధించడం ఆనందంగా ఉంద న్నారు.

వెంకటనగరం పంచాయతీకి
రెండు అవార్డులు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మం డలం వెంకటనగరం గ్రామానికి వివిధ కేటగిరీల కింద రెండు అవార్డులు దక్కాయి.ఉత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా కార్యదర్శి కె.వీరపండు, స్వచ్ఛ గ్రామ పంచాయతీ కేటగిరీలో వెంకట నగరం పూర్వ కార్యదర్శి సిహెచ్.రాణి ఎంపికయ్యారు. సోమవారం అవార్డు అందుకోనున్నారు.

ఉత్తమ పాఠశాల..

అనపర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర- స్వరాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉత్తమ స్వచ్ఛ పాఠశాల అవార్డుకు అనపర్తిలోని శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎంపికైంది. పాఠశాలలో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా స్వచ్ఛతపై నిర్వహించిన అనేక పోటీలలో పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అవార్డుతో స్వచ్ఛతపై మరింత బాధ్యత పెరిగిందని ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకటరెడ్డి అన్నారు.



అనపర్తిలోని శ్రీరామారెడ్డి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

చిరు ఆలోచనతో.. చెత్తశుద్ధి!

కొవ్వూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న ఆలోచన పెద్ద సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు ఆ గ్రామ పంచాయితీకి అవార్డును తెచ్చి పెట్టింది. ప్రతి పంచాయతీలో రహదారుల పక్కన చెత్తను గుట్టలు, గుట్టలుగా పారబోస్తారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారుచేస్తున్నారు. కంపోస్టు ఎరువును రైతులకు, ఏజన్సీలకు కేజీ రూ.10 నుంచి రూ.12 లకు విక్రయించి ఆదాయం ఆర్జిస్తున్నారు. ప్రతినెలా 1.5 టన్నుల నుంచి 2 టన్నుల కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు.దీంతో చెత్త సమస్యకు కొంత పరిష్కారం చూపడంతో పాటు ఆదాయాన్ని అర్జిస్తున్నారు. ప్రతీ పంచాయతీ పంగిడి పంచాయతీని ఆదర్శంగా తీసుకుని చెత్త నుంచి సంపద తయారీ చేయడం ప్రారంభిస్తే చెత్త సమస్యకు చెక్ పడుతుంది. ఈ మేరకు పంగిడిని స్వచ్ఛ పంచాయతీ అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. అవార్డుకు ఎంపికవడం ఆనందంగా ఉందని కార్యదర్శి డి.ముత్యం, సర్పంచ్ గోశాల నాగార్జున, ఉపసర్పంచ్ ఉప్పులూరి ఫణి వెంకట కృష్ణారావు (నానాజీ)లు తెలిపారు.



ఆకాశంలో వహ్హా..లయం

ఆకాశంలో మార్పు.. తర్వాత వర్షం.. అనంతరం వలయం... యానాంలో ఆదివారం మధ్యాహ్నం ఆకాశంలో వలయం ఏర్పడ్డ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా... - యానాం (ఆంధ్రజ్యోతి)

తునిలో విషాదం

ఏరియా ఆసుపత్రిలో కవలలకు జన్మనిచ్చి బాలింత మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



తునిలో రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు


మరణించిన బాలింత రత్నకుమారి


ఆసుపత్రి ఎదుట బంధువులు

తుని రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో విషాదం జరిగింది. ఓ బాలింత పండంటి కవలలకు జన్మనివ్వగా ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. ఆ తల్లి కొన్ని గంటల్లోనే మృతిచెందింది. ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించి బాలింత మృతికి కారణమయ్యారని బంధువులు ఆరోపించారు. వివరాల్లోకి వెళితే... తుని మండలం టి.తిమ్మాపురం గ్రామానికి చెందిన కాపరపు రత్నకుమారి (29)నెలలు నిండడంతో కుటుంబసభ్యులు శుక్రవారం ఆసుపత్రికి తీసుకొచ్చారు. శనివారం ఉదయమే ఆమెకు డెలివరీ అయింది. ఇద్దరు కవల మగబిడ్డలకు జన్మనిచ్చింది. అనంతరం ఆసుపత్రి సిబ్బంది వార్డుకు తరలించారు. అయితే కొద్దిసేపటికే రత్నకుమారికి రక్తస్రావం ప్రారంభమైందని ఎన్నిసార్లు చెప్పినా వైద్యులు, సిబ్బంది కానీ పట్టించుకోలేదని బంధువులు తెలిపారు. సూపరింటిండెంట్‌కు ఫిర్యాదు చేసినా ఆమె నుంచి కనీస స్పందన లేకపోయిందని చెప్పారు. రాత్రి అత్యవసరంగా కాకినాడ తీసుకెళ్లాలని సిబ్బంది చెప్పారని, అంబులెన్స్‌లో కాకినాడ తీసుకెళుతుంటే అన్నవరం చేరుకునే సరికి పరిస్థితి మరింత విషమించిందని అంబులెన్స్ సిబ్బంది సూచనల మేరకు మళ్లీ తుని ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చినట్టు బంధువులు తెలిపారు. అయితే అప్పటికే ఆమె మరణించిందని చెప్పకుండా ఆసుపత్రి సిబ్బంది కొద్దిసేపు చికిత్స చేసినట్టు నటించారని ఆరోపించారు. పరిస్థితి బాగోకపోతే సకాలంలో చెప్తే సరిపోయేదని, వారు పట్టించుకోకుండా బాలింత మృతికి కారణమయ్యారని బంధువులు ఆరోపించారు. తమకు న్యాయం జరగాలని ఆసుపత్రి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఏరియా ఆసుపత్రికి భారీ సంఖ్యలో మృతురాలి బంధువులు, తిమ్మాపురం గ్రామస్తులు చేరుకోవడంతో ఆసుపత్రి వద్ద ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. బంధువుల రోదనలతో ఏరియా ఆసుపత్రి ప్రాంగణం విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డుపై బైఠాయింపు

బాలింత మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాలింత బంధువులు, తిమ్మాపురం గ్రామస్తులు తుని ఏరియా ఆసుపత్రి ముందు ఆందోళన చేపట్టారు. రోడ్డుపై టెంట్ వేసి బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో పెద్దాపురం డీఎస్పీ, స్థానిక పోలీసులు ఆసుపత్రికి చేరుకుని ఆందోళన విరమించాలని వారి చెప్పే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. స్థానిక నాయకులు, ఆసుపత్రి అధికారులు బాలింత బంధువులతో పలు దఫాలు చర్చలు నిర్వహించి నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. ఆందోళన విరమించి బాలింత మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

విచారణకు కలెక్టర్ ఆదేశం

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తుని ఏరియా ఆసుపత్రిలో ఆదివారం తెల్లవారుజామున బాలింత మృతి చెందడంపై విచారణ చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టాలన్నారు. తుని ఏరియా ఆసుపత్రిలో వైద్యుల లోపాలపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

'జలజీవన్ మిషన్'పై నేటి నుంచి శిక్షణ తరగతులు

సామర్లకోట, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు గ్రామీణ నీటిపారుదల విభాగం ఏఈఈలు, డిప్యూటీ ఎంపీడీవోలకు కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో సోమవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కేవీస్వీ ప్రసాదరావు తెలిపారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన 402 మంది అధికారులకు ఈనెల 17 వరకు బ్యాచ్‌ల వారీగా శిక్షణ ఇస్తామన్నారు. విస్తరణ శిక్షణ కేంద్రంలో బోధన, వసతి, భోజన సదుపాయాలను ప్రిన్సిపాల్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సూర్యనారాయణస్వామి, ఏఈఈ వెంకటసాయి రామ్, ఫ్యాకల్టీలు పర్యవేక్షించారు.

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ నిర్బంధం

రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో అడ్డుకున్న పోలీసులు

హైకోర్టు అనుమతి తీసుకుని వారంలో రాజయ్యపేట వెళ్తానన్న యాదవ్


హోటల్ షెల్టాన్‌లో రామచంద్రయాదవ్‌ను బయటకు రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌ను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో పోలీసులు నిర్బంధించారు. వివరాల్లోకి వెళితే... అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న బాధితులకు అండగా నిరసనకు పిలుపునిచ్చిన బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆదివారం నక్కపల్లి బయలు దేరి వెళ్తూ మార్గం మధ్యలో రాజమహేంద్రవరం చేరుకుని హోటల్ షెల్టాన్‌లో బసచేశారు. తిరిగి నక్కపల్లి బయలుదేరుతున్న సమయంలో జిల్లా పోలీసులు షెల్టాన్‌కు చేరుకుని నోటీసు జారీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నక్కపల్లి వెళ్లడానికి వీలులేదని పోలీసులు సూచించారు. దీంతో పోలీసులకు, రామచంద్రయాదవ్ వ్యక్తిగత సెక్యూరిటీ సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిగింది. గదిలోంచి బయటకు వచ్చిన రామచంద్రయాదవ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కరేడు, ఉదయగిరిలలో ఇదేవిధంగా పోలీసులను అడ్డం పెట్టుకుని బాధితులను అణిచివేశారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలంటే లక్షలాది ఎకరాల బీడుభూములు ఉన్నాయని, వ్యవసాయ భూములు, తీర ప్రాంతాల భూములు పరిశ్రమలకు తీసుకోవాలంటే బీసీవై పార్టీ ఊరుకోదని స్పష్టం చేశారు. నక్కపల్లిలో జరుగుతున్న దానిని స్థానికులు అడ్డుకుంటుంటే వారికి అండగా నిలిచేందుకు తాము వెళ్తుంటే దారుణంగా నిర్బంధం విధించడం అన్యాయమన్నారు. జరిగిన సంఘటనపై అవసరమైతే కేంద్రప్రభుత్వంతో మాట్లాడతానని యాదవ్ అన్నారు. వారం రోజుల్లో హైకోర్టులో అనుమతి తీసుకుని రాజయ్యపేట గ్రామం వెళ్తానని చెప్పారు. అనంతరం ఆయన రాజమహేంద్రవరం నుంచి వెనుదిరిగారు.

రెండోరోజు బ్రెజిల్ బృందం పర్యటన

ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల పరిశీలన


కొవ్వూరు: దొమ్మేరులో పంటలను పరిశీలిస్తున్న బ్రెజిల్ బృందం


దేవరపల్లి: కురుకూరులో ఖోఖోపంటను పరిశీలిస్తున్న దృశ్యం

కొవ్వూరు/దేవరపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో బ్రెజిల్ బృందం సభ్యులు రెండోరోజు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను పరిశీలించారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో నీరుకొండ సత్యానారాయణ ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం కాపవరం, ధర్మవరం గ్రామాల్లో పర్యటించి పంటల సాగులో అవలంబిస్తున్న విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మహబూబ్ వల్లీ మాట్లాడుతూ జర్మనీకి చెందిన రైతులు, ఏజన్సీ ప్రతినిధులు బ్రెజిల్ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రతినిధులు సుమారు 27 మంది డెలిగేట్స్ కొవ్వూరు మండలం దొమ్మేరు, కాపవరం, ధర్మవరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారని, రైతులతో మాట్లాడి వ్యవసాయ పద్ధతులను అడిగి తెలసుకున్నారని పేర్కొన్నారు. సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగిందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ సిహెచ్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బ్రెజిల్ బంద సభ్యులు దేవరపల్లి మండల కురుకూరు, యర్నగూడెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ రైతు సాధికారితపై పరిశీలించి రైతులు, అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ఎస్.మాధవరావు, కొవ్వూరు ఏడీఏ శ్రీనివాస్, రైతు సాధికార సంస్థ అధికారులు మధుసూధనరావు, జాకీర్ హుస్సేన్, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ తాతారావు, అడిషనల్ జిల్లా మేనేజర్ వల్లి, మండల వ్యవసాయాధికారి కే.కమలరాజు, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి సతీశ్, రైతులు గద్దే మునేశ్వరరావు, భాస్కరరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'లోవ'లో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.4.43 లక్షల ఆదాయం


భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ


భక్తులతో సందడిగా మారిన ఆలయ ప్రాంగణం

తుని రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా దేవస్థానం ఏర్పాటు చేసిన వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆదివారం ఆలయానికి వివిధ విభాగాల ద్వారా రూ.4.43 లక్షల ఆదాయం వచ్చినట్టు ఈవో విశ్వనాథ రాజు తెలిపారు.

సత్యదేవుడికి రథోత్సవం

అన్నవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ప్రధానాలయం నుంచి స్వామి,అమ్మవార్లను తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చి సర్వాంగసుందరంగా పుష్పాలతో అలంకరించిన రథంపై ఆశీనులు గావించారు. ప్రత్యేక పూజల అనంతరం చైర్మన్ రోహిత్ టెంకాయి కొట్టి రథసేవను ప్రారంభించారు. పండితుల మంత్రోచ్చరణలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీలు


రోలర్ స్కేటింగ్ పోటీలకు సిద్ధపడుతున్న విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్రటరీ, పీడీలు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో భాగంగా ఆదివారం తూరంగిలో రోలర్ స్కేటింగ్ పోటీలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి పర్యవేక్షణలో నిర్వహించారు. వ్యాయామోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి మాచరిరావు, కోశాధికారి నాగలింగేశ్వరరావు, ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు, పీడీలు పట్టాభిరామం, శ్రీహరిరాజు, అప్పారావు, రవి, దుర్గాప్రసాద్, హుస్సేన్ పోటీలను పర్యవేక్షించారు.

రేపు ఎన్టీఆర్ బీచ్‌లో వాలీబాల్, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీలు

అండర్-14, 17 స్కూల్ గేమ్స్ ఎంపికల్లో భాగంగా సోమవారం ఎన్టీఆర్ బీచ్‌లో బీచ్ వాలీబాల్, రగ్బీ, హ్యాండ్‌బాల్ పోటీలు జరుగుతాయని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, పి.సుధారాణి తెలిపారు. ఆసక్తి గలవారు ఉదయం 9 గంటలకు జిల్లా క్రీడా మైదానంలో రిపోర్టు చేయాలని సూచించారు. ఎన్టీఆర్ బీచ్ వరకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. అండర్-17 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు జి.మామిడాడలో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు 9059317248, 9603504347 నెంబర్లను సంప్రదించాలని వారు సూచించారు.

ఆర్టీసీ బస్సు, మోటార్‌సైకిల్ ఢీ యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కోనసీమ జిల్లా బండారులంక శివారు సంఘటన


ప్రమాదంలో మరణించిన శేషగిరి (ఫైల్)

అమలాపురం రూరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం బండారులంక శివారు చినచంద్రాపురంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు తెలిపిన వివరాలివి... సమనస గ్రామానికి చెందిన లింగోలు శేషగిరి (22), చవ్వాకుల దుర్గాచరణ్‌లు ఆదివారం దుర్గాచరణ్ అమ్మమ్మ ఊరు అయిన ఈదరపల్లి వెళ్లారు. తిరిగి మోటార్‌సైకిల్‌పై అంబాజీపేట వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వస్తున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సును ఎదురుగా మోటార్‌సైకిల్ ఢీకొంది. ఏజీ రోడ్డులో షిరిడిసాయిబాబా ఆలయం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో శేషగిరి అక్కడికక్కడే మృతిచెందాడు. దుర్గాచరణ్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108లో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ శేఖర్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఊరేగింపులో బాణసంచా పేలి పురోహితులకు తీవ్రగాయాలు

డీజేను స్వాధీనం చేసుకున్న పోలీసులు


గాయాలపాలైన పురోహితులు

పి.గన్నవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): అమ్మవారి ఊరేగింపులో ప్రమాదవశాత్తు బాణసంచా (జువ్వలు) పేలి అమ్మవారి సేవ చేసే పురోహితులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... దసరా ఉత్సవాల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి శివారు శివాయిలంకలో, మానేపల్లి సెంటర్‌లో గల అమ్మవార్లకు ఊరేగింపు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో శనివారం రాత్రి పదిగంటల సమయంలో శివాయిలంక ఊరేగింపు సెంటర్‌కి చేరుకోవడంతో కొంతమంది యువకులు జువ్వలు వేస్తున్నారు. అదే సమయంలో సెంటర్‌లో మరక అమ్మవారిని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్నారు. అవతల ఊరేగింపు నుంచి వచ్చిన జువ్వ ట్రాక్టర్లో పడడంతో ట్రాక్టర్లో ఉన్న జువ్వలకు నిప్పురవ్వలు అంటుకుని ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో ట్రాక్టర్లో అమ్మవారికి సేవచేస్తున్న పురోహితులు రత్నాగోపాల్ (30), వి.విజయప్రసాద్(50)కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు హుటాహుటిన అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను ఆదివారం పోలీసులు, దేవస్థానం అధికారులు పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. ఊరేగింపు సమయంలో ఉన్న డీజేను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలు సేకరిస్తున్నామని, దర్యాప్తు చేసి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు. యువత అజాగ్రత్త ఇద్దరు పురోహితుల ప్రాణాలమీదకు వచ్చిందని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి తట్టుకోలేక ఉరేసుకున్న యువకుడు


కృష్ణ (ఫైల్)

కొవ్వూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి తట్టుకోలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. వాడపల్లి గ్రామానికి చెందిన అమలాపురం కృష్ణ(25) తాపీపని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. 4నెలల క్రితం రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేటు వెహికల్ ఫైనాన్స్‌లో రూ.9000 చెల్లించి ఫైనాన్స్‌పై స్కూటీ కొనుగోలు చేశాడు. మూడు వాయిదాలు చెల్లించకపోవడంతో ఈ నెల 4న ఉదయం ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు ఇంటికొచ్చి వాయిదా సొమ్ము చెల్లించాలని ఒత్తిడి చేశారు. సోమవారం చెల్లిస్తానని చెప్పినప్పటికీ ఇబ్బందిపెట్టి సోమవారం చెల్లించని పక్షంలో చంపుతామని బెదిరించారు. దీనిపై మనస్తాపం చెందిన కృష్ణ ఆదివారం మధ్యాహ్నం ఇంటిలో ఫ్యాన్ ఉక్కుకు టవల్, లుంగీ కలిపి కట్టుకుని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి అమలాపురం సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పి.విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ విశ్వం తెలిపారు.

గోదావరిలో దూకిన వ్యక్తి

మలికిపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా సఖినేటిపల్లికి చెందిన మేడిది సుదర్శనరావు (35) దిండి-చించినాడ వంతెనపై నుంచి దూకేశాడు. బైక్, సెల్‌ఫోన్‌ను వంతెనపై వదిలాడు. ఇది చూసిన స్థానికులు బంధువులకు సమాచారం అందించారు. అతడికి భార్య, కుమార్తె ఉన్నారు. మలికిపురం పోలీసులను వివరణ కోరగా ఏ సమాచారం లేదని తెలిపారు.

మద్యం మత్తు... కారు, బైక్ చిత్తు!

కారుపైకి దూసుకెళ్లి కూర్చుండిపోయిన యువకుడు

ఆలమూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద జాతీయ రహదారిపై ఒక యువకుడు రాంగ్ రూట్‌లో బైక్ నడుపుతూ మద్యం మత్తులో అతివేగంగా వస్తున్న కారుపైకి దూసుకెళ్లాడు. బైక్ నేరుగా ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో కారు ముందు భాగం (బానెట్, బంపర్) తీవ్రంగా దెబ్బతిన్నాయి. బైక్ పూర్తిగా ధ్వంసమైంది. బైక్ నడుపుతున్న యువకుడు కారు బానెట్‌పై, విండ్‌షీల్డ్ పగిలిన చోట కూర్చుండిపోయాడు. ప్రమాదం జరిగిన సమయంలో యువకుడు మద్యం తాగి ఉన్నాడని స్థానికులు తెలిపారు. రోడ్డుపై వాహనాలు రాకపోకలు నిలిచిపోగా స్థానికులు, ప్రయాణికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


ఆలమూరు మండలం చొప్పెల్ల హైవేపై బైక్‌తో ఢీకొని కారుపైకి ఎక్కిన యువకుడు

మస్కట్ నుంచి సురక్షితంగా స్వస్థలానికి...

కోనసీమ మహిళ రాక

అమలాపురం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మస్కట్ దేశంలో ఇంట్లో పనికోసం వెళ్లి అక్కడ ఇబ్బందులు పడుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం గ్రామానికి చెందిన ఎస్కేఎం బేబిని సురక్షితంగా స్వస్థలానికి తీసుకువచ్చారు. పిఠాపురానికి చెందిన నాగలక్ష్మి ద్వారా గత మే నెలలో ఉపాధి నిమిత్తం మస్కట్ వెళ్లిన బేబికి అక్కడ తలెత్తిన ఇబ్బందుల నేపథ్యంలో కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్ నోడల్ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి జి.రమేష్ సహకారంతో మస్కట్ నుంచి ఆమె స్వస్థలానికి వచ్చినట్టు కలెక్టర్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. మస్కట్‌లో వంట చేసి ఉపాధి పొందే బేబికి అక్కడ ప్రమాదవశాత్తూ కాలుజారి పడిపోవడంతో బలమైన గాయం తగిలి పనిచేయలేని స్థితిలో ఇబ్బందులు పడుతుంది. అక్కడి నుంచి స్వస్థలానికి రావాలని పనికి కుదుర్చుకున్న యజమాని ఆమెను హవాలా ఆఫీసులో వదిలి వెళ్లాడు. ఆమెను స్వదేశానికి పంపాలంటే ప్రయాణ చార్జీలు చెల్లిస్తేనే గానీ ఇండియాకు పంపడం కుదరదని చెప్పడంతో బాధితురాలు బంధువులు సుమారు రూ.లక్ష సమకూర్చారు. అయితే అవి సరిపోకపోవడంతో కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సహాయం కోసం వినతి ఇచ్చారు. దాంతో స్పందించిన కలెక్టర్ మహేష్‌కుమార్‌కోనసీమ సెంటర్ ఫర్ మైగ్రేషన్‌కు ఆదేశాలు జారీ చేయగా మస్కట్‌లోని హవాలా కార్యాలయంతో పూర్తిస్థాయిలో సంప్రదింపులు జరిపి బేబిని మస్కట్ నుంచి స్వస్థలానికి తీసుకురావడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, సమన్వయ అధికారి గోళ్ల రమేష్‌లు తెలిపారు.


మస్కట్ నుంచి స్వస్థలానికి వచ్చిన బేబితో మాట్లాడుతున్న సమన్వయ అధికారి రమేష్

రాజమహేంద్రవరం

40 ఏళ్ల తర్వాత కలిశారు!



రాజమహేంద్రవరం స్టేడియం రోడ్డులోని డీఎం హైస్కూల్ 1984-85 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక స్టేడియం రోడ్డులోని డీఎం హైస్కూల్ 1984-85 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్కూలు ఆవరణలో సందడిగా, సరదాగా జరిగింది. 40 సంవత్సరాల తరువాత ఒక్కటైన పూర్వ విద్యార్థులు తమ తరగతి గదులను సందర్శించి, నాటి సంగతులను గుర్తు చేసుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా, పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. తమ స్నేహితుల్లో పలువురు ఉన్నత స్థితిలో ఉన్నారని, పూర్వ విద్యార్థి కొమ్ము పాపారావు అన్నారు. తమ బ్యాచ్‌లో కొందరు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్నారని, వారికి మిగతా వారు తమ వంతు సాయం అందించడానికి ఉత్సాహం చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నీలాద్రి వెంకటేశ్వరరావు, మావూరి శ్రీను, అక్కిరెడ్డి గోవింద రాజు, వాయు నందనరావు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్‌లకు ప్రమాద బీమా బాండ్లు అందజేత



మెకానిక్‌లకు బీమా బాండ్లను అందించిన ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో బైక్ మెకానిక్‌లుగా పనిచేస్తున్న 350 మందికి భవాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రమాద బీమా బాండ్లను ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అందించారు. ఆదివారం స్థానిక రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే వాసు ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ప్రజావసరాలను తెలుసుకుని సంక్షేమ పథకాలను ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు.దాతలు కూడా ముందుకు వచ్చి పేదలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ తరపున పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కుడుపూడి సత్తిబాబు మాట్లాడుతూ మెకానిక్ డే రోజున మెకానిక్‌లకు ఎమ్మెల్యే వాసు హామీ ఇచ్చారని ఇప్పుడు నెరవేర్చారని గుర్తుచేశారు.అన్ని వర్గాల సంక్షేమానికి ఆయన కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, బుడ్డిగ రాధా మెకానిక్‌లు పాల్గొన్నారు.

12 నుంచి టీడీపీ ఆదిరెడ్డి క్రికెట్ టోర్నమెంట్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం లూథర్‌గిరి గ్రౌండ్స్‌లో ఈ నెల 12నుంచి టీడీపీ ఆదిరెడ్డి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. స్థానిక తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆదివారం టీడీపీ క్రికెట్ టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ కుటుంబ సభ్యులకు ఆటవిడుపు కోసం ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం పార్టీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు మాట్లాడుతూ నగరంలోని 42డివిజన్ల నుంచి 42 జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఈ నెల 26న ఎమ్మెల్యే వాసు పుట్టినరోజు నాటికి టోర్నమెంట్‌ను పూర్తిచేసి ఆదే రోజు విజేతలకు బహుమతులు అందజేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సింహా వెంకటేష్, స్టేడియం రఘు, మహేష్, చాపల చిన్నరాజు, బేసరి చిన్ని, దుత్తరపు గంగాధర్ నేతృత్వంలో ఈ టోర్నమెంట్ జరుగుతుందని నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా తెలిపారు. కార్యక్రమంలో బొర్రా చిన్ని, తురకల నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడు వరద వెంకటరత్నం జయంతి



వెంకటరత్నం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): చిత్రకళ ఆచార్యుడిగా ప్రపంచానికి జగన్మోహన సౌందర్య చిత్రాలనందించిన ఘనత వరద వెంకటరత్నందని ఆంధ్రకేసరి యువజన సమితి పూర్వాధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు అన్నారు. వెంకటరత్నం 130వ జయంతి సందర్భంగా స్థానిక దామెర్ల ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ దామెర్ల స్మారక చిత్రకళ పాఠశాలను స్థాపించి, ఎన్నో ఏళ్లుగా సేవలందించిన వెంకటరత్నంను పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా చిత్రకళ ఆచార్యులు ఆత్మకూరు రామకృష్ణను సమితి సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి మాదిరాజు శ్రీనివాస్, పీవీఎస్ కృష్ణారావు, రఘుపాత్రుని సాయిబాబా, బెజవాడ రంగారావు, రచయిత రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

» అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే నల్లమిల్లి



అనపర్తి ఏఎంసీ నూతన కార్యవర్గంతో ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని ఏఎంసీ కార్యాలయంలో నూతన కార్యవర్గం కొలువుదీరింది. ముందుగా కమిటీ గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే నల్లమిల్లి, చైర్ పర్సన్‌గా జుత్తుగ సూర్యకుమారి, వైఎస్ చైర్మన్‌గా కోనాల వెంకటరెడ్డి, డైరెక్టర్లుగా 14 మందితో బాటు సర్పంచ్ వారా కుమారిలతో కార్యదర్శి శ్రీనివాస్ ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా నూతన పాలక వర్గాన్ని ఎమ్మెల్యేతో బాటు కూటమి నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సిరసపల్లి నాగేశ్వరరావు, నాయకులు జుత్తుక కృష్ణ, దత్తుడు శ్రీను, వెలుగుబంటి సత్తిబాబు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మేలుకే జీఎస్టీ సరళీకృతం

కాగా అనపర్తి వర్తక సంఘం కళ్యాణ మండపంలో జిల్లా వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమానికి ఎమ్మెల్యే నల్లమిల్లి విచ్చేసి ప్రసంగించారు. దేశ ప్రజలపై భారం తగ్గించాలన్న సంకల్పంతో ప్రధాని మోదీ జీఎస్టీని సరళీకృతం చేశారని, దీని వల్ల అనేక రకాల మందుల ధరలు తగ్గాయన్నారు. దేశంలో రక్షణ రంగాన్ని పటిష్ఠం చేయడమే కాకుండా దేశాన్ని ఆర్థికంగా నాలుగో స్థానానికి తీసుకురావడంలో మోదీ పాత్ర కీలకమని అన్నారు. ఈ సందర్భంగా వాణిజ్య శాఖ అధికారులు జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు కొవ్వూరి వెంకటరామారెడ్డి, సత్తి వెంకటరామారెడ్డి, ఏఎంసీ జుత్తుక సూర్యకుమారి, రావాడ నాగు తదితరులు పాల్గొన్నారు.

బొమ్మూరులో ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులో లైన్స్ ఇంటర్నేషనల్, కిమ్స్ (బొల్లినేని) హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు.ఈ సందర్భంగా కిమ్స్ ఈడీ స్వర్ణ రామ్మోహనరావు, చీఫ్ కార్డియాలజిస్ట్ ఎస్ఎస్ రామరాజుకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

పేద విద్యార్థులకు రాంబాబు ఆర్థిక సాయం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): లాలాచెరువు స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు ప్రతిభ గల ఆరుగురు పేద విద్యార్థులకు రూ.63 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆదివారం స్వర్ణాంధ్రలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథి రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర చేతుల మీదుగా ఇంజనీరింగ్, మెడిసిన్, పాలిటెక్నిక్, ఇతర కోర్సులు చదువుతున్న పేద విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున అందించారు. ఈ సందర్భంగా రాంబాబు సేవలను ఆయన అభినందించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ కోణాల సీతామహాలక్ష్మి, సీపీ రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత చింత నాగగౌరి శంకర ప్రసాద్ అతిథులుగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర సిబ్బంది సింధు, స్వామి, శంకర్రావు పాల్గొన్నారు.

నేడు జీఎస్టీపై హైస్కూల్ విద్యార్థులకు పోటీలు జరపాలి

బిక్కవోలు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం సూపర్ జీఎస్టీ 2.0పై వివిధ పోటీలు నిర్వహించాలని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముందుగా విద్యార్థులకు జీఎస్టీ వల్ల గ్రామంలో అందరూ వారు వినియోగించే వస్తువులపై పొందుతున్న లాభాలను వివరించాలన్నారు. విద్యార్థులు వినియోగించే నోట్‌బుక్స్, పెన్సిల్స్, రబ్బర్లు, కాంపెసెస్‌బాక్సులు వంటి వాటిలో తగ్గిన టాక్స్‌లు గూర్చి తెలియజేయాలన్నారు. గ్రామాల్లో ర్యాలీలు జరిపి జీఎస్టీపై అవగాహన కల్పించాలి. అనంతరం విద్యార్థులకు జీఎస్టీపై వ్యాసరచన, డిబేట్, పెయింటింగ్ పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయాలని ఎంఈవో పేర్కొన్నారు.

కనకదుర్గమ్మ నూతన రథం శిఖర ప్రతిష్ఠ



గోకవరంలో నూతన రథానికి శిఖర ప్రతిష్ఠ నిర్వహిస్తున్న దృశ్యం

గోకవరం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): గోకవరం దేవీచౌక్ మల్లేశ్వరస్వామి సమేత కనకదుర్గమ్మ ఊరేగింపు కోసం విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు తయారు చేయించిన నూతన రథం శిఖర ప్రతిష్ఠాపన ఆదివారం జరిగింది. దసరా ఉత్సవా ల సందర్భంగా అమ్మ వారిని ఊరేగించడం కోసం సుమారు రూ.50 లక్షల వ్యయంతో శ్రీనివాసరావు రథాన్ని తయారు చేయించిన సంగతి తెలిసిందే, ఈ క్రమంలో శ్రీనివాసరావు, పద్మావతి దంపతులతో ఆలయ అర్చకుడు వల్లూరి జగన్నాథరావుశర్మ శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, హోమాలు జరిపించి రథానికి శిఖర ప్రతిష్ఠ పూర్తిచేశారు. అనంతరం రథంపై ఉన్న కలశం నుంచి బూరెలను దొర్లించారు.

ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవాలు



బలభద్రపురంలో ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

బిక్కవోలు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం వంద సంవత్సరాల శతాబ్ది విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన దొంతమూరు ఇస్కాన్ డైరెక్టర్ రవీంద్ర చైతన్య దాస్ ప్రభు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వందేళ్లుగా 81వేల శాఖల ద్వారా లక్షలాది మందిని దేశభక్తి, క్రమశిక్షణ గల వ్యక్తులుగా ఆర్ఎస్ఎస్ తీర్చిదిద్దుతోందన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ ఇచ్చిన పిలుపు మేరకు చిట్టచివరి గ్రామంలో హిందూ ధర్మం కోసం-దేశం కోసం పనిచేసే హిందువులను కలవడం కోసం ప్రతి గ్రామం-ప్రతి బస్తీలో వున్న ఇంటింటికీ సంఘ్‌ను పరిచయం చేయాలనే యోచనతో శతాబ్ది కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖ వక్త మల్లిబాబు, పడాల వెంకటరామారెడ్డి, సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి, అధిక సంఖ్యలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతచెట్టు దుర్గమ్మ ఉత్సవాల ముగింపు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పేపరుమిల్లు గేటు సమీపంలో ఉన్న చింతచెట్టు దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి మహాఅన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంచిని పెంచడమే సర్వమత సారం

ఏపీఎస్పీ కమాండెంట్ నరసింహారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమాండెంట్ నరసింహారావు

అనపర్తి, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): సకల మానవాళిలో మంచిని పెంచడమే సర్వమత సారమని ఏపీఎస్పీ కమాండెంట్ కె.నరసింహారావు అన్నారు. స్థానిక ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి తమిళనాడులోని మను జ్యోతి ఆశ్రమం ఆధ్వర్యంలో దేవాశీర్ ఇలారీ రచించిన అమృతమంజరి అంకురం-2 తన ప్రేమ గల చేతుల నైపుణ్యం గ్రంథావిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మతం ఏదైనా మానవత్వం ముఖ్యమని చాటుతూ రచించిన ఆధ్యాత్మిక గ్రంథాన్ని దేశ వ్యాప్తంగానే కాకుండా మలేషియాలో కూడా ఆవిష్కరించడం అభినందనీయమన్నారు.ఈ సందర్భంగా గ్రంథాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ఆవిష్కరించి తొలి ప్రతిని నరసింహారావు, మంగాదేవి దంపతులకు అందజేశారు. కమాండెంట్ దంపతులు మూడు నిమిషాల పాటు శంఖాన్ని పూరించారు. కార్యక్రమంలో నేత్ర వైద్యుడు తేతలి వెంకట్రామిరెడ్డి, జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌పి అబ్బాయిరెడ్డి, ఆర్.రాంబాబు, పి.వెంకటరెడ్డి, టి.సాయిరామకృష్ణ, లహరి కృష్ణ బృందం ప్రతినిధులు ఎన్.సుధాకరరెడ్డి, జి.శ్రీనివాసరావు, ఎన్.రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరికి ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారం

కడియం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కడియం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాసరావు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్, ప్రొఫెసర్ కె.రత్నశీలా మణి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి చేతుల మీదుగా సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆదివారం గుంటూరులోని శ్రీవేంకటేశ్వర వి జ్ఞాన మందిరంలో కేవీఆర్, జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది.ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కేఎస్ లక్ష్మణరావు నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు ఉపాధ్యాయులకు అవార్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు నక్కా వేంకటేశ్వర్లు, ఆలా వేంకటేశ్వర్లు, జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్, వీజీఎస్ పబ్లిషర్స్ జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం



జాన్సన్ చాలిస్సేరి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పక్కన గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా సెయింట్ జాన్సన్ ఇంగ్లీషు మీడియం స్కూలు అధినేత జాన్సన్ చాలిస్సే రీకి కళా గౌతమి సాహిత్య సంస్థ కళాగౌతమి అభినందన పురస్కారం అందజేసి దంపతులిద్దరినీ సన్మాన పత్రం, జ్ఞాపికతో సత్కరించింది. కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి మాట్లాడుతూ జాన్సన్‌కు గురుబ్రహ్మ, ఉత్తమోపాధ్యాయ వంటి అనేక అవార్డులు వచ్చాయని, కులమత భేదం లేకుండా అందర్నీ కలుపుకుని వెళ్లే వ్యక్తి అని ప్రశంసించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పీవీబీ సంజీవరావు, బీహెచ్ రమాదేవి, కె.విజయలక్ష్మి, బలరామనాయుడు, ఎం.సూర్యనారాయణ, డైరెక్టర్ ఎస్‌పీ గంగిరెడ్డి,యార్లగడ్డ మోహనరావు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డుల పండగ

- జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి, 51 జిల్లా స్థాయి అవార్డులు
- విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి అవార్డుల స్వీకరణ
- రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయి అవార్డుల స్వీకరణ
- రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు స్వచ్ఛసర్వేక్షణ్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయం
- కొవ్వూరు బస్‌స్టేషన్‌కు స్వచ్ఛ బస్టేషన్ అవార్డు
- వీటిని అందుకోనున్న మున్సిపల్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్
- కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్



రాజమహేంద్రవరం,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర అవార్డులను ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లాకు మూడు రాష్ట్ర , 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయి. ఈ అవార్డులను సోమవారం అందజేయనున్నారు. స్వచ్ఛ గ్రామ సంఘాలు, స్వచ్ఛ స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ రైతుబజార్, స్వచ్ఛనివాస వసతిగృహాలు, స్వచ్ఛ పురపాలక సంఘం, స్వచ్ఛ పరిశ్రమలు, స్వచ్ఛ వసతి గృహాలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛగ్రామ పంచాయతీలు, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛ అంగన్‌వాడీలు, ఉత్తమ స్వచ్ఛత యోధులు, ఉత్తమ స్వచ్ఛత ఎన్జీఓలు, ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ల విభాగంలో ఈ అవార్డులను ప్రభుత్వం ప్రకటిం చినట్టు జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు లభించిన అవార్డుల వివరాలిలా ఉన్నాయి.

• రాజమండ్రి కార్పొరేషన్, కొవ్వూరు ఆర్టీసీకి రాష్ట్ర స్థాయి అవార్డులు

జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయి. స్వచ్ఛ సర్వేక్షన్‌లో రాష్ట్ర అవార్డు రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు లభించింది. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీలో కూడా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. స్వచ్ఛబస్టేషన్ కేటగిరిలో కొవ్వూరు బస్టేషన్‌కు కూడా రాష్ట్ర స్థాయి అవార్డు వరించింది.

• జిల్లా స్థాయిలో 51 అవార్డుల గ్రహీతలు వీరే..


జిల్లా స్థాయిలో 51 అవార్డులు లభించాయి. అందులో ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్లుగా వెంకటనగరం (కె.వీరపాండు), వేలివెన్ను (బొంగరాల దుర్గాప్రసాద్), నందమూరు (పాల రామారావు), గంటావారి గూడెం (ఉన్నమట్ల నాగరాజు), కుతుకులూరు (బత్తినరాజు)కు లభించాయి. ఉత్తమ స్వచ్ఛత ఎన్జీవోలుగా రాజమండ్రి స్వర్ణ ఆంధ్ర ఫౌండేషన్‌కు నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితికి చెందిన పి.వై.ఎన్‌వీ సతీష్, మల్లిడి శ్రీనివాసరెడ్డి, రాజమండ్రి ప్రజాపతి బ్రహ్మ కుమారి ఈశ్వర్య విశ్వవిద్యాలయంకు చెందిన టీకే హేమ్‌కు లభించాయి. ఉత్తమ స్వచ్ఛత యోధులు విభాగంలో రాజమండ్రి కార్పొరేషన్‌కు చెందిన ఇంటి పార్వతి, రేలంగి సత్యనాగేశ్వరరావు, ముత్యాల పాండురంగ, యార్లగడ్డ సుబ్బాయ్యమ్మ, నిడదవోలు మున్సిపాల్టీకి చెందిన బంగారు సూరిబాబు, బొట్టు శ్రీహరి మామిడిపల్లి కృష్ణవేణి, వడ్డాది దుర్గారావు, కొవ్వూరు మున్సిపాల్టీకి చెందిన మీసాల శ్యాంబాబు, వడ్డాది సత్తిబాబుకు లభించాయి. స్వచ్ఛ అంగన్‌వాడీల విభాగంలో రాజమండ్రి చౌడేశ్వర్‌నగర్ అంగన్‌వాడీకి చెందిన సోమన అరుణాదేవి, కోరుకొండ అంగన్‌వాడీకి చెందిన అజూబా కొడమంచిలి, పెరవలి మండలంలోని ముక్కామల అంగన్వాడీకి చెందిన వరిగేటి నయ్యనమ్మ, కొవ్వూ రాజీవ్ కాలనీ అంగన్‌వాడీకి చెందిన చల్లా కనకదుర్గాదేవి, నిడదవోలు అంగన్వాడీకి చెందిన ఎల్లా మోహినీదేవికి అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో రాజమండ్రి ఆర్డీవో కార్యాలయానికి సంబంధించి ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ధవళేశ్వరం నీటి పారుదల శాఖకు చెందిన జీ. శ్రీనివాసరావుకు లభించాయి. స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో అయా పంచాయతీలకు అవార్డులు వచ్చాయి. వాటిని ఎవరు అందుకుంటారో కూడా ప్రకటించారు. చాగల్లు గ్రామ పంచాయతీకి చెందిన మహబూబ్ ఆలీ, గంటావారి గూడెంకు గ్రామ పంచాయతీకి చెందిన బానోతు వేంకటేశ్వరరావు, కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడికి చెందిన డి.ముత్యం, కాతేరు గ్రామ పంచాయతీకి చెందిన సీహెచ్ రాణి, అనపర్తి మండలం కుతుతుకూలురు చెందిన ఎస్ఎస్ ఫణికుమార్‌కు అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో చాగల్లులోని కల్వలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చింది. దీనిని డాక్టర్ చంద్రబాబు అందుకోనున్నారు. జీహెచ్‌డీ ఖండవల్లికి చెందిన డా. ఏ. హరిశ్రీనివాస్‌కు కూడా వచ్చింది. రాజమండ్రి మెరకవీధిలోని పట్టణ ఆరోగ్యకేంద్రం కూడా అవార్డు పొందింది. దీనిని డా. దిలీప్ కృష్ణచైతన్య అందుకో నున్నారు. స్వచ్ఛ వసతి గృహం విభాగంలో సమిశ్రగూడెం ఎస్సీ కాలనీలోని సామాజిక సంక్షేమ బాలికల వసతి గృహం లభించింది. దీనిని కె.నాగభూషణం అందుకుంటారు. రాజమండ్రి గణేష్ చౌక్ లోని ప్రభుత్వ బీసీ సంక్షేమ కాలేజీ బాలికల వసతి గృహంకు వచ్చింది. దానిని వాసంశెట్టి సత్యవాణి అందుకోనున్నారు. రాజమండ్రి రూరల్‌లోని బొమ్మూరు జీపీహెచ్ఎస్‌కు లభించిది. దీనిని ఎం.ఐ ప్రియదర్శిని అందుకోనున్నారు. స్వచ్ఛ పరిశ్రమల విభాగంలో బలభద్రపురంలోని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు వచ్చింది. దీనిని ఎంజ జగదీష్‌గుప్తా అందుకోనున్నారు. గోకవరం మండలంలోని గుమ్మలదొడ్డిలోని అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వచ్చింది. దీనిని కె.విశ్వనాథనాయుడు అందుకోనున్నారు. రాజమండ్రి రూరల్‌లోని తేజాస్ స్టీల్ ఇండస్ట్రీస్‌కు అవార్డు వచ్చింది. దీనిని సేథీ రమేష్‌కుమార్ అందుకోనున్నారు. రాజమండ్రి రూరల్‌ని ధవళేశ్వరానికి చెందిన హౌస్ ఆఫ్ ట్రైబ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డు వచ్చింది. దీనిని కిశోర్ అందుకోనున్నారు. ఇక స్వచ్ఛ పురపాలక సంఘాల కేటగిరిలీలో నిడదవోలు మున్సిపాల్టీకి అవార్డు వచ్చింది. దీనిని ఏఎం సత్యనారాయణ అందుకోనున్నారు. స్వచ్ఛ నివాస వసతి గృహాల విభాగంలో ధవళేశ్వరంలోని ఏపీఎస్ డబ్ల్యుఆర్ఎస్‌కు అవార్డు వచ్చింది. దీనిని ఏ. వాణికుమారి అందుకోనున్నారు. స్వచ్ఛ రైతుబాజ్ విభాగంలో రాజమండ్రి క్వారీ రైతుబజార్‌కు వచ్చింది. దీనిని ఎస్. రోజియా అందుకోనున్నారు. స్వచ్ఛ పాఠశాలల విభాగంలో రఘుదేవపురం పీఎంశ్రీజెడ్‌పి హైస్కూల్‌కు రాగా శ్యామలాదేవి అందుకోనున్నారు. నిడదవోలు జెడ్‌పీ హెచ్ గర్ల్స్ హైస్కూల్‌కు రాగా దీనిని నిట్టల అరుణరాజేశ్వరి ఫిలిఫ్ అందుకోనున్నారు. అనపర్తి బాలుర ఎస్ఆర్ జెడ్‌పీహెచ్ఎస్ ప్లస్‌కు రాగా దానిని పి. వెంకటరెడ్డి అందుకోనున్నారు. రాజమండ్రి రూరల్‌లోని శాటిలైట్ సిటీ జెడ్‌పీ హెచ్‌కు రాగా దానిని ఎస్. ప్రశాంతి అందుకోనున్నారు, కొవ్వూరు మండలం కుమారదేవం మండల ప్రజాపరిషత్ పాఠశాల-1కు రాగా దానిని పి. చాముండేశ్వరి అందుకోనున్నారు. స్వచ్ఛ సహాయ సంఘాల విభాగంలో రాజమండ్రి కృష్ణానగర్‌లోని సీతంపేట మహిళా సహకర సంఘానికి రాగా, టి. కనకరాజు అందుకోనున్నారు. కొవ్వూరు రాజీవ్‌కాలనీ మహిళా సంఘానికి, కొవ్వూరు వాంబే కాలనీ శ్రీనివాస కాలనీ రాగా టి. కనకరాజు అందుకోనున్నారు. స్వచ్ఛ గ్రామసంఘాల విభాగంలో రంగంపేటలోని చంద్రేడ్ గ్రామ సంఘం ఇన్‌చార్జి బి. అబ్బులు, పెరవలి మండలంలోని కానూరుకు చెందిన బండారు రామకృష్ణ, గోపాలపురం మండలం కరిచర్ల గూడెంకు చెందిన పెనుమాక రోజ్ మాణిక్యం, రాజానగరం మండలం వెలుగుబండకు చెందిన గుమ్మడి సునీత, కొవ్వూరు మండలం వేము లూరుకు చెందిన కంఠం విజయనిర్మల కుమారి అవార్డులు అందుకోనున్నారు.

26న శెట్టిబలిజ వన భోజనాలు


సానబోయిన రామారావు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 5(ఆంధ్ర జ్యోతి): ఈనెల 26న రాజమహేంద్రవరం లోని జేఎన్ రోడ్డులో చెరుకూరి గార్డెన్స్ వద్ద శెట్టిబలిజ వన భోజనాలు నిర్వహిస్తున్నామని శెట్టిబలిజ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత సానబోయిన రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం మూలగొయ్యి సమీపంలోని రామాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆహ్వాన పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ శెట్టిబలిజ కార్తీక వన భోజనాలు ఈనెల 26న నిర్వహించాలని సంఘం పెద్దలు నిర్ణయించారని, సంఘీయులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం సహ అధ్యక్షులు మట్టపర్తి సత్యనారాయణ, కార్యదర్శి బత్తిన ఏడుకొండలు, కోశాధికారి బొక్కా వెంకట ప్రతాప్, పోలవరపు రాము, సింహం చిన్న, దూడల వెంకట విశ్వనాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గౌతమ్



రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాజమహేంద్రవరానికి చెందిన గుర్రం గౌతమ్‌ను నియమించారు. ఈ మేరకు గౌతమ్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.గౌతమ్ గతంలో వైసీపీలో వివిధ పదవులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు గౌతమ్‌ను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించినట్టు వైసీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. తన నియామకానికి కృషి చేసిన వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్‌కు గౌతమ్ ధన్యవాదాలు తెలియజేశారు.







తగ్గినా..ఇంతేనా!



పుష్కరఘాట్ వద్ద తగ్గిన గోదావరి.. ఇంకనూ గేటు వద్ద సెక్యూరిటీ

గోదావరి తగ్గుముఖం పట్టింది.. సాధారణ స్థాయికి చేరింది.. అయినా ఆంక్షలు మాత్రం తొలగలేదు.. నేటికీ రేవుల వద్దకు ఎవరినీ వెళ్లనీయడంలేదు..దీంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు.. ఇటీవల గోదావరికి వరద పోటెత్తడం.. ఇద్దరు భవానీల మృతితో ఆంక్షలు విధించారు. గోదావరి తగ్గినా ఇంకా ఆంక్షలు మాత్రం కొనసాగుతున్నాయి. ఆంక్షలు సడలించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఫొటోగ్రాఫర్- రాజమహేంద్రవరం



రాజమహేంద్రవరంలో జరిగిన ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల సమావేశానికి హాజరైన సచివాలయ ఉద్యోగులు.. మాట్లాడుతున్న సంఘ నాయకులు



116 ఎకరాలు కేటాయించిన రాజమహేంద్రవరంలోని బ్రిడ్జిలంక

భూ..లోకం!

ఉమ్మడి జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులకు 205 ఎకరాలు

పర్యాటక రంగానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.. పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తే అడిగింది ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో 205 ఎకరాలు భూములు సిద్ధం చేసింది.. ఇందులో రాజమహేంద్రవరానికి చేరువగా బ్రిడ్జిలంక వద్ద 116 ఎకరాలు సేకరించారు.. కడియం, సీతానగరం , కాకినాడ తదితర ప్రాంతాల్లోనూ భూములు ఉండడం గమనార్హం. ఆసక్తి ఉండి ముందుకొస్తే చాలు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ప్రకృతి అందాలకు నెలవైన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పర్యాటక రంగాన్ని పరుగులు తీయించేందుకు ప్రభుత్వం శరవేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే గోదావరి అందాలు,సముద్ర తీరం వెంబడి అనేస సాహస జలక్రీడల నిర్వహణకు సన్నాహాలు చేస్తోన్న ప్రభుత్వం తాజాగా పర్యాటక పెట్టుబడులను భారీగా ఆహ్వానించేందుకు కసరత్తు ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో చిన్న, మధ్యతరహా, భారీ పర్యాటక పెట్టుబడులతో ముందుకొచ్చే కంపెనీలకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా తక్షణమే భూములు కేటాయించేలా భూ బ్యాంకు సిద్ధం చేసింది.తక్కువ ధరకే భూములు దీర్ఘకాలిక లీజులపై కేటాయించాలని నిర్ణయించింది.ఈ మేరకు ప్రభుత్వమే ఉమ్మడి జిల్లాలో 205 ఎకరాల భూములు సిద్ధం చేసింది.కాకినాడ, ఏలేశ్వరం, గోగుల్లంక, పిచ్చుకలంక,సీతానగరం, కడియపులంక తదితర అద్భుత పర్యాటక అందాలు ఉన్న ప్రాంతాల్లో భూములు కేటాయించేందుకు ఏర్పాట్లు చేసింది.రాజమండ్రిలోని బ్రిడ్జిలంక వద్ద 116 ఎకరాలు సిద్ధం చేసింది.

కూటమి ప్రత్యేక దృష్టి

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉమ్మడి జిల్లాలో పర్యాటక రంగం పూర్తిగా పడకేసింది. గోదావరిలో బోటు షికారు, కాకినాడ హోప్ఐలాండ్ షికారు, దిండి రిసార్ట్స్ వద్ద బోటింగ్ ఇలా దేనికీ వసతులు కల్పించక బోట్లు కేటాయించక పర్యాటక రంగం ఈసురోమంది. కాకినాడ సాగర తీరంలో యుద్ధవిమాన మ్యూజియానికి సైతం నిధులివ్వకుండా ఖాళీగా వదిలేసింది. ప్రభుత్వం మారిన తర్వాత గడచిన ఏడాదిగా ఉమ్మడి జిల్లాలో పర్యాటక సదుపా యా లకు సర్కారు పెద్దపీట వేస్తోంది.నిధులు కేటాయిస్తోంది. గత ప్రభుత్వంలో ఏ మాత్రం పట్టించుకోని గోదావరి హేవలాక్ వంతెనతో పాటు చుట్టుపక్కల అనేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కేంద్రం నుంచి రూ.94.44 కోట్ల నిధులు రాబట్టి అఖండ గోదావరి ప్రాజెక్టుకు జూన్‌లో శంకుస్థాపన చేసింది. గోదావరి ఇసుక తిన్నెల్లో 120 ఎకరాల్లో టెంట్‌సిటీ నిర్మాణానికి అడుగులు వేస్తోంది.ఐదేళ్లుగా నిలిచిన కాకినాడ హోప్ ఐలాండ్ పర్యాటకాన్ని ఇటీవల పునరుద్ధరించింది.కాకినాడ, రాజమహేంద్రవరం,కోనసీమ జిల్లాల్లో 18 చోట్ల అడ్వంచర్ టూరిజం ప్రోత్సహించడానికి ఆదేశాలిచ్చింది.కాలువలు, సముద్రతీరం వెంబడి సాహస జలక్రీడలు అందుబాటు లోకి తెచ్చేలా టెండర్లు పిలిచింది.ఉమ్మడి జిల్లాలో పర్యాటక పెట్టుబడులు కోట్లలో రాబట్టేందుకు వీలుగా భూబ్యాంకు సిద్ధం చేసింది.

- పర్యాటకానికి పెద్దపీట
- భూమిని సిద్ధం చేసిన ప్రభుత్వం
- దీర్ఘకాలిక లీజుపై ఇచ్చే యోచన
- పెట్టుబడుదారులకు ఆహ్వానం
- ముందుకొస్తే భూకేటాయింపు
- ఉమ్మడి జిల్లాలో అమలు
- నాడు ఏమీ పట్టని వైసీపీ
- నేడు పట్టు వదలని కూటమి



అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా కడియం వద్ద ఇలా.

భూములున్నదిక్కడే..

పర్యాటక ప్రాజెక్టులకు భూములు తక్షణం కేటాయించేందుకు వీలుగా కాకినాడ నగరానికి సమీపంలోని తమ్మవరంలో 12.66 ఎకరాలు భూ బ్యాంకు తయారు చేసింది. సర్వేనెంబరు 292 నుంచి 299 వరకు సముద్రానికి దగ్గర ఉన్న భూములు రకరకాల పర్యాటక ప్రాజెక్టులు ఇచ్చేందుకు సిద్ధం చేసింది. వీటిలో హోటళ్లు, రిసార్టులు, బైక్, కారు రేసింగ్‌లు, సాహస క్రీడల ప్రాజెక్టులకు కేటాయించనుంది.ఏలేశ్వరం వద్ద సర్వే నెంబరు 83/2లో 15 ఎకరాలు సిద్ధం చేసింది. ఇక్కడ రిసార్టులు,నేచర్ టూరిజం ప్రోత్సాహానికి కేటాయింపులు చేయనున్నారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో సర్వే నెం బరు 799లో 9.9 ఎకరాల భూబ్యాంకు సిద్ధమైంది. ఇక్కడా గోదావరి అందాలు వీక్షించేలా బోటింగ్ రెస్టారెంట్,అడ్వంచర్ గేమ్స్ ఏర్పాటుకు భూ కేటాయింపులు జరపనున్నారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం గోదావరి అందా లకు పెట్టింది పేరు. ఇక్కడ ఎన్నో సినిమాలు చిత్రీకరణ జరిగాయి. అద్భుతమైన లొకేషన్లు ఉన్న ఈ ప్రాంతంలో సర్వేనెంబరు 327/1లో 7.5 ఎకరాల భూ బ్యాంకును అందుబాటులోకి తెచ్చారు. రిసార్టులు, హోటళ్లు, బోటింగ్,హ ట్‌లు, వాటర్ స్పోర్ట్స్ ఇలా ఏతరహా పర్యాటక పెట్టుబడులు పెట్టాలన్నా వీటిని కేటాయించనున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని బ్రిడ్జిలంక వద్ద ఏకంగా 116 ఎకరాల అన్ సర్వేయడ్ భూమిని సిద్ధం చేశారు. టెంట్ హౌస్‌లు, బోటింగ్, రిసార్టుల నిర్మాణానికి వీటిని కేటాయించాలని నిర్ణయించారు. కడియపులంకలో సర్వే నెంబరు 402/1లో 2.60 ఎకరాలు, కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక దీవిలో సర్వే నెంబరు 155/1లో 26 ఎక రాల భూ బ్యాంకు సిద్ధమైంది. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గోగుల్లంక వద్ద సర్వే నెంబరు 759లో 13.62 ఎకరాలు సిద్ధంగా ఉన్నాయి. ఇక్కడ గోదావరి అందాల వీక్షణ,కేరళ తరహాలో కొబ్బరి చెట్ల అందాలు, మండువా లోగిళ్లు పర్యాటకులను అలరించనున్నాయి. ఇక్కడ రిసార్టులు, హోటళ్ల నిర్మాణానికి భూములు కేటాయించనున్నారు.పట్టిసీమలో 168 ఎకరాలు పర్యాటక సం స్థలు,వ్యక్తులకు కేటాయించనున్నారు.వీటిని తక్కువ ధరకు దీర్ఘకాలిక లీజుపై కేటాయించనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

వలంటీర్ల విధులు చేయలేం

రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక చైర్మన్ జానీ పాషా

రాజమహేంద్రవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : వలంటీర్ల విధుల నుంచి సచివాలయ ఉద్యోగులకు విముక్తి కలిగించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ ఎండీ జానీ పాషా, సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్ కృష్ణ,కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ హెచ్చరించారు.రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రంలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల ఐక్యవేదిక ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రాంతీయ సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, వలంటీర్ విధుల నుంచి విముక్తి కల్పిం చాలని, ఆరేళ్లుగా ఒకే క్యాడర్‌లో పనిచేస్తున్నందున ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్ ద్వారా స్పెషల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని, రికార్డు అసిస్టెంట్ పేస్కేల్‌తో క్యాడర్ అప్ గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బత్తుల అంకమ్మరావు, యువ షణ్ముఖ, కేవీ.రాజేష్‌బాబు, వి.భార్గవ్ సుతేజ్, ఎస్‌కె.మహమూబ్,జీవీఎస్ శ్రీనివాస్, కె.షాలెం, కృష్ణ వెస్లీ, ఆళ్ల శ్రీధర్‌రెడ్డి, బి.రోజా ప్రకాష్, ఎస్.నాగేశ్వరరావు, ఎస్‌కె మహబూబా సుభానీ, దడాల జగ్గారావు, నవకోటి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



జీఎస్‌ఎల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కుటుంబరావు, చిత్రంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వెంకటేశ్వరరావు, జీఎస్‌ఎల్ చైర్మన్ గన్ని భాస్కరరావు తదితరులు

పేదరిక నిర్మూలనకే పీ4

స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ కుటుంబరావు

రాజానగరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంద సంస్థలు, పెద్దలు పీ4 కార్యక్రమంలో పాల్గొని పేదరిక నిర్మూలనలో భాగస్వాములై ప్రభుత్వానికి అండగా నిలవాలని స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ చెరుకూరి కుటుంబరావు పేర్కొన్నారు. రాజానగరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో జీఎస్ఎల్ హెల్త్‌కేర్ అండ్ హెల్త్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పీ4 అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్ (పి4)కార్యక్రమాలు చేపట్టేవారికి ఎలాంటి జాప్యం లేకుండా సింగిల్ విండో విధానం తీసుకొచ్చే యోచన చేస్తున్నామన్నారు. స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ సీఈవో సీహెచ్.నరేష్ కుమార్ మాట్లాడుతూ పీ4లో భాగంగా చేపట్టిన సర్వేలో 20 లక్షల మంది బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులకు పీ4లో చోటు దక్కలేదని, తిరిగి పీ4 సర్వే మరోసారి నిర్వహించాలని కోరారు. జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ పీ4 కార్యక్రమ నిర్వహణకు సాయం అందజేస్తున్నామన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, రోటరీ ప్రెసిడెంట్ తీగల రాజా, తిరుమల చైర్మన్ నున్న తిరుమలరావు, జాస్తి మూర్తి, డాక్టర్ దివ్య, వి.రామనాథ్, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరాజు, గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ,బ్రహ్మాజీ, వీరన్న చౌదరి పాల్గొన్నారు.



కోటసత్తెమ్మకు పూజలు

నిడదవోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం,సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహా నివేదన చేశారు. ప్రత్యేక పూల అలంకరణలో ఉన్న అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.అమ్మవారికి రూ.1,84,316 ఆదాయం లభించినట్టు దేవ స్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్య ప్రకాష్, చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ తెలిపారు.



దసరా ఉత్సవాలు ముగిశాయి.. అమ్మవార్లకు 9 రోజుల పాటు పూజలు చేశారు..ఆదివారం అమ్మవార్లను నిమజ్జనానికి తరలించారు. తాడిపర్రులో హంసవాహనంపై అమ్మవారిని ఊరేగించారు. - ఉండ్రాజవరం

స్వచ్ఛం..సత్యం!

ఇటీవల ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డులను ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి, 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయి. ఈ అవార్డులను సోమ వారం అందజేయనున్నారు.రాష్ట్ర స్థాయి అవార్డులు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా రాజమహేంద్రవరం కార్పొరేషన్ అడిష నల్ కమిషనర్ పీవీ.రామలింగేశ్వర్, కొవ్వూరు ఆర్టీసీ డీఎం వైవీవీఎస్.కుమార్ అందుకోనున్నా రు.జిల్లా స్థాయి అవార్డులను ఆనం కళాకేంద్రం లో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి చేతుల మీదుగా ఆయా అవార్డు గ్రహీ తలు అందుకోనున్నారు. జిల్లాలోని ప్రజాప్రతి నిధులకు, అవార్డు గ్రహీతలకు జిల్లాస్థాయి అధికారులకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి.

- జిల్లాకు 54 స్వచ్ఛాంధ్ర అవార్డులు
- 3 రాష్ట్రస్థాయి..51 జిల్లాకు ఎంపిక
- కష్టపడ్డారు..ఫలితం సాధించారు
- నేడు అవార్డులు అందజేత
- ఇప్పటికే ఆహ్వానాలు చేరిక



పంగిడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



కొవ్వూరు బస్టాండ్

కొవ్వూరు బస్టాండ్..అద్వితీయం!

కొవ్వూరు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఆర్టీసీ బస్టాండ్ స్వచ్ఛత అవార్డుల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయస్థానానికి ఎంపికైంది. గతంలో కొవ్వూరుకు డిపో మేనేజర్‌గా పనిచేసిన వై.వి.వి.ఎస్.కుమార్ ఆధ్వర్యంలో డిపో, బస్టాండ్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలోను, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం, పరిసరాలలో మొక్కలు నాటి సంరక్షించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని స్వచ్ఛత అవార్డుకు ఎంపిక చేశారు. దీనిపై ప్రస్తుత రావులపాలెం డిపో మేనేజర్ వై.వీ.వీ.ఎస్.కుమార్ మాట్లాడుతూ డిపోలోని అందరి ఉద్యోగులు, కార్మికుల సహకారంతో అవార్డును సాధించామని, అవార్డుకు ఎంపికవడం ఆనందాన్ని కలిగించిందన్నారు.

ఆర్‌డీవో ఆఫీస్..సూపర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశుభ్రమైన కార్యాలయంగా రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం అవార్డు సాధించింది. ఆర్‌డీవోగా ఆర్.కృష్ణనాయక్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ప్లాస్టిక్ రహిత కార్యాలయంగా తీర్చిదిద్దారు. కార్యాలయ సిబ్బంది తాగునీటికి ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లను వినియోగించవద్దని సూచించి స్వయంగా స్టీల్ వాటర్ బాటిళ్లు,జ్యూట్ బ్యాగ్‌లు అందజేశారు.డస్ట్ బిన్నులను ఏర్పాటు చేయించారు. కార్యాలయానికి వచ్చే ప్రజలకు ప్లాస్టిక్‌పై అవగాహన కల్పిస్తున్నారు.సబ్‌కలెక్టర్ కార్యాలయానికి అవార్డు రావడం పట్ల ఆర్‌డీవో కృష్ణనాయక్ ఆనందం వ్యక్తం చేశారు.

చెత్తను అమ్మేస్తున్నారు..



అనపర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి మండలం కుతుకులూరు ఉత్తమ స్వచ్ఛ గ్రామ పంచాయతీగా ఎంపికైంది. పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది చూపిస్తున్న అంకిత భావం అవార్డు సాధనకు దోహదపడింది. అంచెలంచెలుగా పంచాయతీలో తడి చెత్త పొడిచెత్తపై ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుం డా ఇలా విడదీసిన చెత్త ద్వారా ఎరువును త యారు చేసి విక్రయిస్తూ ఆదాయం చేకూరుస్తు న్నారు. కార్యదర్శి ఫణికుమార్ మాట్లాడు తూ అవార్డు సాధించడం ఆనందంగా ఉంద న్నారు.

వెంకటనగరం పంచాయతీకి రెండు అవార్డులు

రాజమహేంద్రవరం రూరల్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మం డలం వెంకటనగరం గ్రామానికి వివిధ కేటగిరీల కింద రెండు అవార్డులు దక్కాయి.ఉత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా కార్యదర్శి కె.వీరపండు, స్వచ్ఛ గ్రామ పంచాయతీ కేటగిరీలో వెంకట నగరం పూర్వ కార్యదర్శి సిహెచ్.రాణి ఎంపికయ్యారు. సోమవారం అవార్డు అందుకోనున్నారు.

ఉత్తమ పాఠశాల..

అనపర్తి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర- స్వరాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉత్తమ స్వచ్ఛ పాఠశాల అవార్డుకు అనపర్తిలోని శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎంపికైంది. పాఠశాలలో స్వచ్ఛ కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా స్వచ్ఛతపై నిర్వహించిన అనేక పోటీలలో పాఠశాల విద్యార్థులు బహుమతులు సాధించారు. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచడమే కాకుండా స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన కల్పించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అవార్డుతో స్వచ్ఛతపై మరింత బాధ్యత పెరిగిందని ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకటరెడ్డి అన్నారు.



అనపర్తిలోని శ్రీరామారెడ్డి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల

చిరు ఆలోచనతో.. చెత్తశుద్ధి!

కొవ్వూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒక చిన్న ఆలోచన పెద్ద సమస్యకు పరిష్కారం చూపడంతో పాటు ఆ గ్రామ పంచాయితీకి అవార్డును తెచ్చి పెట్టింది. ప్రతి పంచాయతీలో రహదారుల పక్కన చెత్తను గుట్టలు, గుట్టలుగా పారబోస్తారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటా సేకరించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో వర్మీ కంపోస్టు తయారుచేస్తున్నారు. కంపోస్టు ఎరువును రైతులకు, ఏజన్సీలకు కేజీ రూ.10 నుంచి రూ.12 లకు విక్రయించి ఆదాయం ఆర్జిస్తున్నారు. ప్రతినెలా 1.5 టన్నుల నుంచి 2 టన్నుల కంపోస్టు ఎరువును తయారు చేస్తున్నారు.దీంతో చైత సమస్యకు కొంత పరిష్కారం చూపడంతో పాటు ఆదాయాన్ని అర్జిస్తున్నారు. ప్రతీ పంచాయతీ పంగిడి పంచాయతీని ఆదర్శంగా తీసుకుని చెత్త నుంచి సంపద తయారీ చేయడం ప్రారంభిస్తే చెత్త సమస్యకు చెక్ పడుతుంది. ఈ మేరకు పంగిడిని స్వచ్ఛ పంచాయతీ అవార్డుకు ప్రభుత్వం ఎంపిక చేసింది. అవార్డుకు ఎంపికవడం ఆనందంగా ఉందని కార్యదర్శి డి.ముత్యం, సర్పంచ్ గోశాల నాగార్జున, ఉపసర్పంచ్ ఉప్పులూరి ఫణి వెంకట కృష్ణారావు (నానాజీ)లు తెలిపారు.

సంఘటిత భారత్ మన లక్ష్యం

● సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు రమణమూర్తి


చాగల్లులో జరిగిన ఆర్ఎస్ఎస్ సమావేశంలో పాల్గొన్న ప్రముఖులు

చాగల్లు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): సామరస్యతతో కూడిన సంఘటిత భారత్ లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పనిచేస్తోందని సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు టీ. రమణమూర్తి అన్నారు. ఆదివారం సుబ్రహ్మణ్యస్వామి మైదానంలో ఆర్ఎస్ఎస్ చాగల్లు శాఖ ఆధ్వర్యంలో వంద సంవత్సరాలు వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, మన వారసత్వాన్ని భావితరాల వారికి అందించడమే లక్ష్యంగా అందరూ కృషిచేయాలన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు తాళ్లూరి వరప్రసాద్, జుట్టా గణపతి, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకునేందుకే సీఎంఆర్ఎఫ్ : ఎమ్మెల్యే


బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, అచ్యుతరామయ్య (అచ్చిబాబు)

కొవ్వూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు రాష్ట్రప్రభుత్వం సీఎంఆర్ఎఫ్‌ను అందిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఆంధ్రా సుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ఐదుగురికి మంజూరైన రూ. 2,71,679 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన నరకుల నరసింహస్వామికి రూ. 30,786, తిరుమళ్ల పాపాయమ్మకు రూ. 57,205, గుత్తా రామకృష్ణకు రూ. 27,493, కంటన భాస్కరరావుకు రూ. 1,27,786, పైలా జయశ్రీకి రూ.28,409 చెక్కులను అందజేశారు. ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, అల్లూరి విక్రమాదిత్య, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, బేతిన నారాయణ, సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు, కేవీకే రంగారావు, నీటి సంఘం అధ్యక్షుడు గొరిజాల సురేష్, సొసైటీ అధ్యక్షుడు చావా శ్రీనివాసరావు, నాయుడు వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకదుర్గమ్మ విగ్రహాల ఊరేగింపు

● తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్చుతూ యువత కేరింతలు


పాటెమ్మపేటలో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

చాగల్లు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా పాటెంపేటలోని బాల కనక దుర్గమ్మను ఆదివారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చుతూ డప్పు వాయిద్యాల నడుమ విచిత్ర వేషధారణలతో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవీనవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెనుక ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవార్ని భక్తుల భుజాల పై మోసుకుంటూ ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఊరచెరువులో నిమజ్జనం చేశారు.


దేవరపల్లిలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి తట్టుకోలేక
ఉరేసుకున్న యువకుడు


కృష్ణ (ఫైల్ ఫొటో)

కొవ్వూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి తట్టుకోలేక యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన వాడపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. వాడపల్లికి చెందిన అమలాపురం కృష్ణ (25) తాపీపని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నాలుగు నెలల క్రితం రాజమహేంద్రవరంలో ఒక ప్రైవేట్ వెహికల్ ఫైనాన్స్‌లో రూ.9000 చెల్లించి స్కూటీ కొనుగోలు చేశాడు. మూడు వాయిదాలు చెల్లించకపోవడంతో ఈనెల 4న ఉదయం ఫైనాన్స్ కంపెనీ ఏజెంట్లు ఇంటికొచ్చి వాయిదా సొమ్ము చెల్లించాలని ఒత్తిడి చేశారు. సోమవారం చెల్లిస్తానని చెప్పినప్పటికీ ఇబ్బందిపెట్టి ... చెల్లించని పక్షంలో చంపుతామని బెదిరించారు. దీనిపై మనస్థాపం చెందిన కృష్ణ ఆదివా రం మధ్యాహ్నం ఇంటిలో ఫ్యాన్ ఉక్కుకు టవల్, లుంగీ కలిపి కట్టుకుని ఉరేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తండ్రి అమలాపురం సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ సీఐ పి.విశ్వం సం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

కుక్కల బెడద

● నిడదవోలు పట్టణంలో విచ్చలవిడిగా స్వైరవిహారం
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు ● ఆందోళనలో ప్రజలు


పట్టణంలోని ఓ వీధిలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

నిడదవోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పట్టణంలో కుక్కల బెడద వేధిస్తోంది. ప్రధాన సెంటర్లలో గుంపులు..గుంపులుగా సంచరిస్తుండడంతో అటుగా వెళ్లే చిన్నారులతో పాటు వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఏ వాడలో చూసినా సుమారు 15 నుంచి 20 వరకు తిరుగుతూ కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉదయం పాఠశాలలకు వెళ్లే చిన్నారులు సాయంకాలం ఇంటికి వచ్చే సమయంలో హడలిపోతున్నారు. దీంతో వారి తల్లితండ్రులు వీధుల్లో కాపు కాయాల్సిన పరిస్థితి ఉంది. ఎప్పుడూ లేని విధంగా పట్టణంలో వీటి సంచారం విచ్చలవిడిగా పెరిగిపోయినా ... మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్టయినా లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సోషల్ మీడియా వేదికగా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందుతున్నాయి. గతంలో కుక్క కాటుకు బలై ఎందరో ఆసుపత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. చిన్నారుల ప్రాణాలు పోయేంత వరకు మున్సిపల్ అధికారులు స్పందించరా అంటూ వారంతా ప్రశ్నిస్తున్నారు. చిన్నారులకు చేటు కలగకముందే మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జీఎస్టీపై పోటీలు నిర్వహించాలి : ఎంఈవో

బిక్కవోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం సూపర్ జీఎస్టీ 2.0పై వివిధ పోటీలు నిర్వహించాలని ఎంఈవో సీహెచ్ వీవీ సత్యనారాయణ హెచ్ఎంలకు సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ముందుగా విద్యార్థులకు జీఎస్టీ వల్ల గ్రామంలోని వారు వినియోగించే వస్తువులపై పొందుతున్న లాభాలు గూర్చి వివరించాలన్నారు.

రెండోరోజూ బ్రెజిల్ బృందం పర్యటన


కొవ్వూరు : దొమ్మేరులో పంటలను పరిశీలిస్తున్న బ్రెజిల్ బృందం


దేవరపల్లి: కురుకూరులో ఖోఖో పంటను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతుల పరిశీలన

కొవ్వూరు/దేవరపల్లి, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో బ్రెజిల్ బృందం సభ్యులు రెం డోరోజు సందర్శించారు. ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను పరిశీలిం చారు. ఆదివారం కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో నీరుకొండ సత్యనారాయణ ప్రకృతి వ్యవసాయక్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం కాపవరం, ధర్మవరం గ్రామాల్లో పర్యటించి పంట ల సాగులో అవలంభిస్తున్న విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మహబూబ్ వల్లీ మాట్లాడుతూ జర్మనీకి చెందిన రైతులు, ఏజన్సీ ప్రతినిధులు బ్రెజిల్ మంత్రిత్వ శాఖకు చెందిన ప్రతినిధులు సుమారు 27 మంది డెలిగేట్స్ కొవ్వూరు మండలం దొమ్మేరు, కాపవరం, ధర్మవరం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారని, రైతులతో మాట్లాడి వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు. సందేహాలను నివృత్తి చేసుకోవడం జరిగిందన్నారు. వ్యవసాయశాఖ ఏడీ సిహెచ్.శ్రీనివాసరావు, మండల వ్యవసాయా ధికారి ఏ.గంగాధర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. బ్రెజిల్ బంద సభ్యులు దేవరపల్లి మండల కురుకూరు, యర్నగూడెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ రైతు సాధికారితపై పరిశీలించి రైతులు, అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు ఎస్.మాధవరావు, కొవ్వూరు ఏడీఏ శ్రీనివాస్, రైతు సాధికార సంస్థ అధికారులు మధుసూధనరావు, జాకీర్‌హుస్సేన్, ప్రకృతి వ్యవసాయ జిల్లా మేనేజర్ తాతారావు, అడిషనల్ జిల్లా మేనేజర్ వల్లి, మండల వ్యవసాయాధికారి కే.కమలరాజు, ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి సతీశ్, రైతులు గద్దే మునేశ్వరరావు, భాస్కరరావు, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్ నిర్బంధం

● రాజమహేంద్రవరం షెల్టాన్ హోటల్‌లో అడ్డుకున్న పోలీసులు
● హైకోర్టు అనుమతి తీసుకుని వారంలో రాజయ్యపేట వెళ్తానని సవాల్


హోటల్ షెల్టాన్‌లో రామచంద్రయాదవ్‌ను బయటకు రాకుండా అడ్డుకుంటున్న పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు5(ఆంధ్రజ్యోతి): బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్‌ను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హోటల్ షెల్టాన్‌లో పోలీసులు నిర్బంధించారు. వివరాల్లోకి వెళితే.. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకిస్తున్న బాధితులకు అండగా నిరసనకు పిలుపునిచ్చిన బీసీవై పార్టీ అధినేత రామచంద్రయాదవ్ ఆదివారం నక్కపల్లి బయలు దేరి వెళ్తూ మార్గం మధ్యలో రాజమహేంద్రవరం చేరుకుని హోటల్ షెల్టాన్‌లో బసచేశారు. తిరిగి నక్కపల్లి బయలుదేరుతున్న సమయంలో జిల్లా పోలీసులు షెల్టాన్‌కు చేరుకుని నోటీసు జారీ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నక్కపల్లి వెళ్లడానికి వీలులేదని పోలీసులు సూచించారు. దీంతో పోలీసులకు, రామచంద్రయాదవ్ వ్యక్తిగత సెక్యూరిటీ సిబ్బందికి మధ్య వాగ్వాదం జరిదింది. గదిలోంచి బయటకు వచ్చిన రామచంద్రయాదవ్‌ను పోలీసులు అడ్డుకోవడంతో ఆయన పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కరేడు, ఉదయగిరిలలో ఇదేవిధంగా పోలీసులను అడ్డం పెట్టుకుని బాధితులను అణిచివేశారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావాలంటే లక్షలాది ఎకరాల బీడుభూములు ఉన్నాయని, వ్యవసాయ భూములు, తీర ప్రాంతాల భూములు పరిశ్రమలకు తీసుకోవాలంటే బీసీవై పార్టీ ఊరుకోదని స్పష్టం చేశారు. నక్కపల్లిలో జరుగుతున్న దానిని స్థానికులు అడ్డుకుంటుంటే వారికి అడంగా నిలిచేందుకు తాము వెళ్తుంటే దారుణంగా నిర్బంధం విధించడం అన్యాయమన్నారు.

జరిగిన సంఘటనపై అవసరమైతే కేంద్రప్రభుత్వంతో మాట్లాడతానని యాదవ్ అన్నారు. వారం రోజుల్లో హైకోర్టులో అనుమతి తీసుకుని రాజయ్యపేట గ్రామం వెళ్తానని చెప్పారు. అనంతరం ఆయన రాజమహేంద్రవరం నుంచి వెనుదిరిగారు.

చాగల్లులో ఉచిత వైద్యశిబిరం

చాగల్లు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాటెమ్మతల్లి ఆడిటోరియంలో ఆదివారం చాగల్లు, నెలటూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేరికోస్‌న్ వీన్స్ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. సుశ్రుత ఫౌండేషన్ ఏషియన్ వాస్కులర్ హాస్పటల్ (హైదరాబాద్) వారు వైద్యసేవలు అందించారు. లయన్స్ సభ్యులు లింగాల శ్రీనివాస శర్మ ఆర్థిక సాయంతో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస శర్మ, కోట సూర్యారావు హాజరై సంయుక్తంగా ప్రారంభించారు. చాగల్లు, పరిసర మండలాల నుంచి సుమారు 100 మంది వచ్చి వైద్యపరీక్షలు నిర్వహించుకున్నారు. ఇందులో 35 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. వీరికి హైదరాబాద్‌లో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు వల్లిపల్లి వెంకట రామారావు, కే. అచ్యుతరామ ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన ఉపవాస ప్రత్యేక ప్రార్థనలు


చివటం జేసీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న సంఘు విశ్వాసులు

ఉండ్రాజవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చివటం జేసీఎం చర్చిలో గత మూడు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు ఆదివారంతో ముగిశాయి. చర్చి పాస్టర్ టీ. అబ్బులు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పాస్టర్ అబ్బులు మాట్లాడుతూ యేసుక్రీస్తు బోధనలు మన జీవితాలకు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమ, దయ, కరుణ గుణాలను కలిగి ఉండాలన్నారు. క్వయిర్‌చే సుమధుర గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో సంఘు విశ్వాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేటికీ లభించని గల్లంతైన వ్యక్తి ఆచూకీ


పెండ్యాల గోదావరిలో గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం

నిడదవోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పెండ్యాలలో గోదావరి గట్టుపై బహిర్భూమికి వెళ్లిన ఉల్లూరి చిరంజీవి ఆచూకీ కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు చేపడుతూనే ఉంది. 2వ తేదీన ఉల్లూరి చిరంజీవి (64) ప్రమాదవశాత్తు గోదావరిలో గల్లంతయ్యాడు. ఆదివారం నాటికి నాలుగు రోజులు అవుతున్నా... ఆచూకీ లభించలేదు. మంత్రి దుర్గేష్ ఆదేశాలతో తహశీల్దార్ నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు కొనసాగిస్తూనే ఉంది.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిడదవోలు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని చినకాశీరేవు సమీపంలో సుమారు 60 సంవత్సరాలు గల వ్యక్తిని గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. అతడి ఒంటిపై ఎరుపు రంగు గళ్ల చొక్కా, ఎరుపు, నీలం, బిస్కట్ రంగుల గుడల లుంగీ ధరించి ఉన్నాడు. సమాచారం తెలిసినవారు 9490617090 నెంబర్‌కు తెలియజేయాలని రైల్వే ఎస్ఐ పీ. అప్పారావు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

బలభద్రపురంలో ఆర్ఎస్ఎస్ విజయదశమి ఉత్సవాలు

బిక్కవోలు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): బలభద్రపురంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం వంద సంవత్సరాల శతాబ్ది విజయదశమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న దొంతమూరు ఇస్కాన్ డైరెక్టర్ రవీంద్రచైతన్య దాస్‌ప్రభు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా గత వంద సంవత్సరాలుగా 81వేల శాఖల ద్వారా లక్షలాది మందిని దేశ భక్తి, క్రమశిక్షణ గల వ్యక్తులుగా ఆర్ఎస్ఎస్ తీర్చిదిద్దుతుందన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ ఇచ్చిన పిలుపు మేరకు చిట్టచివరి గ్రామంలో కూడ హిందూ ధర్మం కోసం - దేశం కోసం పనిచేసే హిందువులను కలవడం కోసం ప్రతి గ్రామం- ప్రతి బస్తీలో వున్న ఇంటింటికీ సంఘ్‌ను పరిచయం చేయాలనే యోజనతో శతాబ్ది కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రముఖ వక్త మల్లిబాబు, పడాల వెంకటరామారెడ్డి, సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి, అధిక సంఖ్యలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డుల పండగ

● జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి, 51 జిల్లా స్థాయి అవార్డులు
● విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర స్థాయి అవార్డుల స్వీకరణ
● రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో జిల్లా స్థాయి అవార్డుల స్వీకరణ
● రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు స్వచ్ఛసర్వేక్షణ్, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయం
● కొవ్వూరు బస్‌స్టేషన్‌కు స్వచ్ఛ బస్టేషన్ అవార్డు
● వీటిని అందుకోనున్న మున్సిపల్ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్
● కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎన్ కుమార్



రాజమహేంద్రవరం,అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర అవార్డులను ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. జిల్లాకు మూడు రాష్ట్ర , 51 జిల్లా స్థాయి అవార్డులు వచ్చాయి. ఈ అవార్డులను సోమవారం అందజేయనున్నారు. స్వచ్ఛ గ్రామ సంఘాలు, స్వచ్ఛ స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛ పాఠశాలలు, స్వచ్ఛ రైతుబజార్, స్వచ్ఛనివాస వసతిగృహాలు, స్వచ్ఛ పురపాలక సంఘం, స్వచ్ఛ పరిశ్రమలు, స్వచ్ఛ వసతి గృహాలు, స్వచ్ఛ ఆసుపత్రులు, స్వచ్ఛగ్రామ పంచాయతీలు, స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛ అంగన్‌వాడీలు, ఉత్తమ స్వచ్ఛత యోధులు, ఉత్తమ స్వచ్ఛత ఎన్జీఓలు, ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్ల విభాగంలో ఈ అవార్డులను ప్రభుత్వం ప్రకటిం చినట్టు జాయింట్ కలెక్టర్ వై.మేఘస్వరూప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు లభించిన అవార్డుల వివరాలిలా ఉన్నాయి.

● **రాజమండ్రి కార్పొరేషన్, కొవ్వూరు ఆర్టీసీకి రాష్ట్ర స్థాయి అవార్డులు**

జిల్లాకు మూడు రాష్ట్ర స్థాయి అవార్డులు లభించాయి. స్వచ్ఛ సర్వేక్షన్‌లో రాష్ట్ర అవార్డు రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు లభించింది. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల కేటగిరీలో కూడా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌కు రాష్ట్రస్థాయి అవార్డు లభించింది. స్వచ్ఛబస్టేషన్ కేటగిరిలో కొవ్వూరు బస్టేషన్‌కు కూడా రాష్ట్ర స్థాయి అవార్డు వరించింది.

● **జిల్లా స్థాయిలో 51 అవార్డుల గ్రహీతలు వీరే..**

జిల్లా స్థాయిలో 51 అవార్డులు లభించాయి. అందులో ఉత్తమ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్లుగా వెంకటనగరం (కె.వీరపాండు), వేలివెన్ను (బొంగరాల దుర్గాప్రసాద్), నందమూరు (పాల రామారావు), గంటావారి గూడెం (ఉన్నమట్ల నాగరాజు), కుతుకులూరు (బత్తినరాజు)కు లభించాయి. ఉత్తమ స్వచ్ఛత ఎన్జీవోలుగా రాజమండ్రి స్వర్ణ ఆంధ్ర ఫౌండేషన్‌కు నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితికి చెందిన పి.వై.ఎన్‌వీ సతీష్, మల్లిడి శ్రీనివాసరెడ్డి, రాజమండ్రి ప్రజాపతి బ్రహ్మా కుమారి ఈశ్వర్య విశ్వవిద్యాలయంకు చెందిన బీకే హేమ్‌కు లభించాయి. ఉత్తమ స్వచ్ఛత యోధులు విభాగంలో రాజమండ్రి కార్పొరేషన్‌కు చెందిన ఇంటి పార్వతి, రేలంగి సత్యనాగేశ్వరరావు, ముత్యాల పాండురంగ, యార్లగడ్ల సుబ్బాయ్యమ్మ, నిడదవోలు మున్సిపాల్టీకి చెందిన బంగారు సూరిబాబు, బొట్టు శ్రీహరి మామిడిపల్లి కృష్ణవేణి, వడ్డాది దుర్గారావు, కొవ్వూరు మున్సిపాల్టీకి చెందిన మీసాల శ్యాంబాబు, వడ్డాది సత్తిబాబుకు లభించాయి. స్వచ్ఛ అంగన్‌వాడీల విభాగంలో రాజమండ్రి చొడేశ్వర్‌నగర్ అంగన్‌వాడీకి చెందిన సోమన అరుణాదేవి, కోరుకొండ అంగన్‌వాడీకి చెందిన అజూబా కొడమంచిలి, పెరవలి మండలంలోని ముక్కామల అంగన్వాడీకి చెందిన వరిగేటి నయ్యనమ్మ, కొవ్వూ రాజీవ్ కాలనీ అంగన్‌వాడీకి చెందిన చల్లా కనకదుర్గాదేవి, నిడదవోలు అంగన్వాడీకి చెందిన ఎల్లా మోహినీదేవికి అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ ప్రభుత్వ కార్యాలయాల విభాగంలో రాజమండ్రి ఆర్డీవో కార్యాలయానికి సంబంధించి ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, ధవళేశ్వరం నీటి పారుదల శాఖకు చెందిన జీ. శ్రీనివాసరావుకు లభించాయి. స్వచ్ఛ గ్రామ పంచాయతీల విభాగంలో ఆయా పంచాయతీలకు అవార్డులు వచ్చాయి. వాటిని ఎవరు అందుకుంటారో కూడా ప్రకటించారు. చాగల్లు గ్రామ పంచాయతీకి చెందిన మహబూబ్ అలీ, గంటావారి గూడెంకు గ్రామ పంచాయతీకి చెందిన బానోతు వేంకటేశ్వరరావు, కొవ్వూరు మండలం ఇసుకపట్ల పంగిడికి చెందిన డి.ముత్యం, కాతేరు గ్రామ పంచాయతీకి చెందిన సీహెచ్ రాణి, అనపర్తి మండలం కుతుతుకూలురు చెందిన ఎస్ఎస్ ఫణికుమార్‌కు అవార్డులు వచ్చాయి. స్వచ్ఛ ఆసుపత్రుల విభాగంలో చాగల్లులోని కల్వలపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చింది. దీనిని డాక్టర్ చంద్రబాబు అందుకోనున్నారు. జీహెచ్‌డీ ఖండవల్లికి చెందిన డా. ఏ. హరిశ్రీనివాస్‌కు కూడా వచ్చింది. రాజమండ్రి మెరకవీధిలోని పట్టణ ఆరోగ్యకేంద్రం కూడా అవార్డు పొందింది. దీనిని డా. దిలీప్ కృష్ణచైతన్య అందుకో నున్నారు. స్వచ్ఛ వసతి గృహం విభాగంలో సమిశ్రగూడెం ఎస్సీ కాలనీలోని సామాజిక సంక్షేమ బాలికల వసతి గృహం లభించింది. దీనిని కె.నాగభూషణం అందుకుంటారు. రాజమండ్రి గణేష్ చౌక్ లోని ప్రభుత్వ బీసీ సంక్షేమ కాలేజీ బాలికల వసతి గృహంకు వచ్చింది. దానిని వాసంశెట్టి సత్యవాణి అందుకోనున్నారు. రాజమండ్రి రూరల్‌లోని బొమ్మూరు జీపిహెచ్ఎస్‌కు లభించిది. దీనిని ఎం.ఐ ప్రియదర్శిని అందుకోనున్నారు. స్వచ్ఛ పరిశ్రమల విభాగంలో బలభద్రపురంలోని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు వచ్చింది. దీనిని ఎంజ జగదీష్‌గుప్తా అందుకోనున్నారు. గోకవరం మండలంలోని గుమ్మలదొడ్డిలోని అస్సాగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వచ్చింది. దీనిని కె.విశ్వనాథనాయుడు అందుకోనున్నారు. రాజమండ్రి రూరల్‌లోని తేజాస్ స్టీల్ ఇండస్ట్రీస్‌కు అవార్డు వచ్చింది. దీనిని సేథీ రమేష్‌కుమార్ అందుకోనున్నారు. రాజమండ్రి రూరల్‌ని ధవళేశ్వరానికి చెందిన హౌస్ ఆఫ్ ట్రైబ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డు వచ్చింది. దీనిని కిశోర్ అందుకోనున్నారు. ఇక స్వచ్ఛ పురపాలక సంఘాల కేటగిరిలీలో నిడదవోలు మున్సిపాల్టీకి అవార్డు వచ్చింది. దీనిని ఏఎం సత్యనారాయణ అందుకోనున్నారు. స్వచ్ఛ నివాస వసతి గృహాల విభాగంలో ధవళేశ్వరంలోని ఏపీఎస్ డబ్ల్యుఆర్ఎస్‌కు అవార్డు వచ్చింది. దీనిని ఏ. వాణికుమారి అందుకోనున్నారు. స్వచ్ఛ రైతుబాజ్ విభాగంలో రాజమండ్రి క్వారీ రైతుబజార్‌కు వచ్చింది. దీనిని ఎస్. రోజియా అందుకోనున్నారు. స్వచ్ఛ పాఠశాలల విభాగంలో రఘుదేవపురం పీఎంశ్రీజెడ్‌పి హైస్కూల్‌కు రాగా శ్యామలాదేవి అందుకోనున్నారు. నిడదవోలు జెడ్పీ హెచ్ గర్ల్స్ హైస్కూల్‌కు రాగా దీనిని నిట్టల అరుణరాజేశ్వరి ఫిలిఫ్ అందుకోనున్నారు. అనపర్తి బాలుర ఎస్ఆర్ జెడ్‌పీహెచ్ఎస్ ప్లస్‌కు రాగా దానిని పి. వెంకటరెడ్డి అందుకోనున్నారు. రాజమండ్రి రూరల్‌లోని శాటిలైట్ సిటీ జెడ్పీ హెచ్‌కు రాగా దానిని ఎస్. ప్రశాంతి అందుకోనున్నారు, కొవ్వూరు మండలం కుమారదేవం మండల ప్రజాపరిషత్ పాఠశాల-1 కు రాగా దానిని పి. చాముండేశ్వరి అందుకోనున్నారు. స్వచ్ఛ సహాయ సంఘాల విభాగంలో రాజమండ్రి కృష్ణానగర్‌లోని సీతంపేట మహిళా సహకర సంఘానికి రాగా, టి. కనకరాజు అందుకోనున్నారు. కొవ్వూరు రాజీవ్‌కాలనీ మహిళా సంఘానికి, కొవ్వూరు వాంబే కాలనీ శ్రీనివాస కాలనీ రాగా టి. కనకరాజు అందుకోనున్నారు. స్వచ్ఛ గ్రామసంఘాల విభాగంలో రంగంపేటలోని చంద్రేడ్ గ్రామ సంఘం ఇన్‌చార్జి బి. అబ్బులు, పెరవలి మండలంలోని కానూరుకు చెందిన బండారు రామకృష్ణ, గోపాలపురం మండలం కరిచర్ల గూడెంకు చెందిన పెనుమాక రోజ్ మాణిక్యం, రాజానగరం మండలం వెలుగుబండకు చెందిన గుమ్మడి సునీత, కొవ్వూరు మండలం వేము లూరుకు చెందిన కంఠం విజయనిర్మల కుమారి అవార్డులు అందుకోనున్నారు.